## అప్పు ఇస్తూ..నడ్డి విరుస్తున్న మైక్రో ఫైనాన్స్ సంస్థలు..!



-దమ్మపేట మండలంలోని గిరిజన మహిళలే టార్గెట్
-మహిళలను గ్రూప్‌లుగా చేసి రుణాలు
-వారానికోకసారి కట్టాలి.. లేకుంటే అదనపు వసూలు
-మైక్రో రుణాలపై 36 శాతం వరకు వడ్డీ

2లో..

www.prajapaksham.in
ప్రజాపక్షం
ప్రతి అక్షరం ప్రజల కోసం
స్తంభాద్రి భద్రాద్రి
ఆదివారం | 21 | సెప్టెంబర్ | 2025
పేజీలు : 8

# ఒక బస్తా..  మూడు క్యూలు..!



-జిల్లాలో తీరని యూరియా కొరత
-సొసైటీల వద్ద తోపులాట
-కొందరికే సానుకూలమని సొసైటీ బాధ్యులపై వెల్లువెత్తుతున్న ఆరోపణలు



**ప్రజాపక్షం/ ఖమ్మం :** ఒక యూరియా బస్తా కోసం రైతులు మూడు క్యూలలో నిలబడాల్సిన పరిస్థితి దాపురించింది. సాదాసీదాగా బయలుదేరి అలా వెళ్లి ఇలా రసాయనిక ఎరువులు తెచ్చుకునే పరిస్థితి నుండి మూడు క్యూలలో నిలబడితే తప్ప ఒక యూరియా బస్తా దొరకని పరిస్థితి. అది కూడా నమ్మకం లేదు. కేంద్ర ప్రభుత్వం వివక్షాపూరిత ధోరణి రాష్ట్రం పట్ల అవలంభించడం దానికి తోడు సాగు విస్తీర్ణం, రసాయనిక ఎరువుల అవసరాలు తదితర వాటిని అంచనా వేయడంలో అధికార యంత్రాంగం వైఫల్యం కూడా రైతులకు శాపంగా మారింది. ఇప్పుడు ఒక యూరియా బస్తా కోసం రోజంతా మూడు క్యూలలో నిలుచోవాల్సి వస్తుంది. తొలుత తగిన ఆధారాలు చూపుతూ సంబంధిత వ్యవసాయ అధికారి వద్ద కూపన్ రాయించుకోవాల్సి ఉంటుంది. ఆ కూపన్ తీసుకుని సొసైటీ కార్యాలయానికి వెళ్లి మరల క్యూలో నిలబడి తంబ్ వేసి నగదు చెల్లించి రశీదు పొందాల్సి ఉంది. ఈ రశీదు

మిగతా 2లో..

## ఉద్యోగ భద్రత, సంక్షేమమే లక్ష్యం



-కనీస వేతన చట్టాన్ని అమలు చేయాలి
-మున్సిపల్ వర్కర్స్ మహాసభలో రాష్ట్ర కార్యదర్శి జైపాల్‌రెడ్డి

**ప్రజాపక్షం/ఖమ్మం :** మున్సిపల్, కార్పోరేషన్‌లో పనిచేస్తున్న స్టాఫ్, అవుట్‌సోర్సింగ్ వర్కర్స్ ఉద్యోగ భద్రత, సంక్షేమమే లక్ష్యంగా తెలంగాణ రాష్ట్ర మున్సిపల్ స్టాఫ్ అండ్ అవుట్ సోర్సింగ్ వర్కర్స్ యూనియన్ (ఏఐటియుసి) పనిచేస్తుందని రాష్ట్ర కార్యదర్శి వనంపల్లి జైపాల్ రెడ్డి తెలిపారు. సంక్షేమం, హక్కుల కోసం సంఘటిత పోరాటాలు చేపట్టాలని ఆయన పిలుపునిచ్చారు. తెలంగాణ రాష్ట్ర మున్సిపల్ స్టాఫ్ అండ్ అవుట్‌సోర్సింగ్ వర్కర్స్ యూనియన్ మూడవ మహాసభలు శనివారం స్థానిక అంబేద్కర్ భవన్‌లో జరిగాయి. అంతకు ముందు జెడ్పి సెంటర్ నుండి అంబేద్కర్ భవన్ వరకు మున్సిపల్ కార్మికులు భారీ ర్యాలీ నిర్వహించారు. మహాసభల ప్రారంభ సూచికంగా ఏఐటియుసి రాష్ట్ర కార్యవర్గ సభ్యులు బిజి క్లెమెంట్ ఏఐటియుసి పతాకాన్ని ఆవిష్కరించారు. ఊడల కృష్ణ, తాటి నాగేంద్ర బాబు అధ్యక్ష వర్గంగా వ్యవహరించిన

మిగతా 2లో..

## బాంబుల లెక్క తేలిందా..?



**ప్రజాపక్షం/పాల్వంచ :** పచ్చని పల్లెలు శక్తి వంతమైన బాంబుల మోతలతో దద్దరిల్లుతున్నాయి. సాయంత్రం ఆరు గంటల అయిందంటే చాలు బాంబుల శబ్దాలు మోతలతో పల్లె ప్రజల గుండెలదురుతున్నాయి. సెలవు రోజులను లక్ష్యంగా చేసుకొని మరింత రెచ్చిపోతున్నారు. బాంబుల బ్లాస్టింగ్‌లతో సుమారు నాలుగు, ఐదు కిలో మీటర్ల పరిధిలో గల గ్రామాలు అదిరిపోతున్నాయి. ఇంత జరుగుతున్నా అధికారులు పట్టించుకోకుండా చోద్యం చూస్తున్నారనే విమర్శలు వస్తున్నాయి. క్వారీలలో బండ రాళ్ళలను పెకిలించేందుకు తెచ్చిన శక్తి వంతమైన

- పక్కదారి పడుతున్న బాంబులు !
- మోగుతున్న బాంబులు..దద్దరిల్లుతున్న పల్లెలు
- చోద్యం చూస్తున్న అధికారులు
- ఎంఎల్‌ఏ సహాయ నిరాకరణ
- పెంచిన ధరలు..పెద్ద ఎత్తున దోపిడీ

బాంబులను ( జిలటిన్ స్టిక్స్ ) పక్కదారి పట్టిస్తున్నారు. అసాంఘిక శక్తుల చేతుల్లోకి వెళుతున్నాయని దీనితో అధికారులు తనిఖీలు

మిగతా 2లో..

# ఉద్యోగ భద్రత, సంక్షేమమే లక్ష్యం







(మొదటిపేజీ తరువాయి)

సమావేశంలో జైపాల్‌రెడ్డి మాట్లాడుతూ మున్సిపాలిటీలు కార్పోరేషన్లలో శ్రమ దోపిడీ జరుగుతుందన్నారు. నగరాలు, పట్టణాలను సుందరంగా తీర్చిదిద్దడంలో కీలక భూమిక పోషిస్తున్న మున్సిపల్ పారిశుధ్య కార్మికులకు కనీస వేతనాలు చెల్లించడం లేదని ఆయన తెలిపారు. ప్రతి పారిశుధ్య కార్మికునికి నెలకు రూ. 26వేలు చెల్లించాలని ఆయన డిమాండ్ చేశారు. కనీస వేతన చట్టంలో మున్సిపల్ కార్మికులను చేర్చకపోవడం శోచనీయమని 20 ఏళ్లుగా పనిచేస్తున్న వారిని సైతం ఇంకా నైపుణ్యత లేని వారిగా గుర్తించడం ఏమిటని జైపాల్‌రెడ్డి ప్రశ్నించారు. ప్రభుత్వ ఉద్యోగులకు 20 రేట్లు వేతనాలు పెరిగినా మున్సిపల్ కార్మికులకు మాత్రం అందులో 50వ వంతు కూడా పెరగలేదని ఆయన తెలిపారు. మున్సిపల్ కార్మికుల పట్ల పాలక వర్గాలు వివక్షను ప్రదర్శిస్తున్నాయని ఆయన తెలిపారు. చాలా సందర్భాల్లో పని ఒత్తిడికి గురి చేస్తూ కొందరు బెదిరింపులకు పాల్పడుతున్నారని ఇది సరైంది కాదన్నారు. వైరాలో స్పెషల్ డ్రైవ్ క్రింద 55 మందిని తీసుకున్నారని వారికి మున్సిపల్ చట్టాలను వర్తింపజేయాలని ఆయన కోరారు. దసరా తర్వాత మున్సిపల్ కార్మికులకు ఇందిరమ్మ ఇండ్ల కేటాయింపు, కనీస వేతన అమలు తదితర సమస్యల సాధనకు పోరాట కార్యాచరణ ప్రకటించనున్నట్లు జైపాల్‌రెడ్డి తెలిపారు. అనేక దశాబ్దాల పాటు ఏఐటియుసి నేతృత్వంలో పోరాడి సాధించుకున్న హక్కులకు కేంద్ర ప్రభుత్వం తూట్లు పొడుస్తుందని ఆయన ఆరోపించారు. ఎనిమిది గంటల పని స్థానే పది గంటల పని విధానం తీసుకు రావడంపై ఆయన ఆగ్రహం వ్యక్తం చేశారు. సమావేశ అనంతరం 43 మందితో నూతన కమిటీని ఎన్నుకున్నారు. ఈ మహాసభల్లో ఏఐటియుసి రాష్ట్ర కార్యదర్శి శింగు నర్సింహారావు, బిజి క్లెమెంట్ తదితరులు ప్రసంగించగా ఈ సమావేశంలో ఏఐటియుసి జిల్లా అధ్యక్ష, కార్యదర్శులు గాదె లక్ష్మి నారాయణ, తోట రామాంజనేయులు, కార్యనిర్వహక అధ్యక్షులు రావి శివరామకృష్ణ, ఏఐటియుసి నాయకులు వేము రాంబాబు, గారపాటి అశోక్, సిహెచ్ వెంకటేశ్వర రావు, కృష్ణ, బుర్రి ఉపేందర్, నాగేంద్రబాబు, వజీర్‌మియా, కృష్ణ మూర్తి, రాయపూడి శ్రీను, చింతల శ్రీను, రవీందర్‌రెడ్డి, ఏబు, దయాకర్, మహేష్ తదితరులు పాల్గొన్నారు.

# ఒక బస్తా.. మూడు క్యూలు..!

(మొదటిపేజీ తరువాయి)

తీసుకుని సొసైటీ గోడౌన్ వద్దకు వెళ్లి క్యూలో నిలుచుంటే ఒక యూరియా బస్తా దక్కుతుంది. ఈ క్యూలో నిలబడి ఒక యూరియా బస్తా సాధించడానికి ఒక్కొక్కసారి రెండు నుంచి మూడు రోజులు పడుతుంది. లేదా కాలం కలిసొస్తే ఒక రోజులో పూర్తవుతుంది. చాలా సొసైటీ కార్యాలయాల వద్ద రైతుల మధ్య తోపులాట జరుగుతుంది. పోలీస్ బందోబస్తు మధ్య యూరియా బస్తాల పంపిణీ జరుగుతుందంటే పరిస్థితి ఏవిధంగా ఉందో అవగతం చేసుకోవచ్చు. శుక్రవారం కారేపల్లిలో రైతుల మధ్య తోపులాట జరగగా శనివారం బోనకల్ మండలం రావినూతల సొసైటీ వద్ద తోపులాట జరిగింది. సిఈవోలు, సొసైటీ ఛైర్మెన్లు కొందరి పట్ల సానుకూలంగా వ్యవహరిస్తూ వారికే కూపన్లు ఇస్తున్నారని యూరియా సైతం తమకు ఇష్టమైన వారికి పదే పదే ఇస్తున్నారని ఇవ్వని వారికి ఒక బస్తా కూడా ఇచ్చే పరిస్థితి లేదన్న ఆరోపణలు వినవస్తున్నాయి. రావినూతల సొసైటీలో సిఈవో, సొసైటీ బాధ్యులు ఓ వర్గానికి మాత్రమే యూరియా అందిస్తున్నారని సొసైటీ డైరెక్టర్లు ఆరోపిస్తున్నారు. ఒక పక్క వ్యవసాయ పనులు వదిలి పొద్దంతా యూరియా కోసం నిలబడిన దక్కడం లేదని యూరియా వేసే అదును దాటిపోతుందని రైతులు వాపోతున్నారు. పెట్టుబడి కోసం చూసుకుని నానా తంటాలు పడుతున్న నేపథ్యంలో యూరియా కష్టాలు మరింత ఇబ్బందికరంగా మారాయి. యూరియా కొరతపై రాజకీయ పక్షాలు ఒకరినొకరు విమర్శించుకోవడాన్ని పక్కన పెట్టి రైతుకు యూరియా అందించే దానిపై దృష్టి సారించాలని రైతులు కోరుతున్నారు. జిల్లాలో మరో నెల రోజుల పాటు యూరియా వాడకం ఎక్కువగా ఉండే అవకాశం ఉందని అంచనా వేస్తున్నారు.

# బాంబుల లెక్క తేలిందా..?

(మొదటిపేజీ తరువాయి)

నిర్వహించారు. కొందరిపై కేసులు నమోదు చేసిన సంధర్భాలు ఉన్నాయి. గత సంవత్సరం రోజున అప్పటి ఓఎస్‌డి క్వారీలను తనిఖీ చేశారు. బాంబుల లెక్క తప్పుల తడకగా ఉండటంతో ఆగ్రహం వ్యక్తం చేశారు. అనంతరం క్వారీ యాజమానులతో అత్యవసర సమావేశం నిర్వహించారు. బాంబుల లెక్కలు పక్కాగా ఉండాలంటూ ఆదేశించారు. తెచ్చిన బాంబులు, ఉపయోగించిన బాంబులు, మిగిలిన బాంబుల లెక్కలు, బ్లాస్టింగ్ పాల్పడే రోజు తదితర వివరాలను ఎప్పటికప్పుడు స్థానిక పోలీస్ స్టేషన్‌లో సవివరంగా ఇవ్వాలంటూ హుకుం జారీ చేశారు. కొన్ని రోజులపాటు లెక్క నిర్వహించినా ... మైనింగ్ మాఫియా అనంతరం ఆ విషయాన్ని మరుగున పడేసింది. దీనితో బాంబుల లెక్కలపై నిర్లక్ష్యం వహించినది. దీనితో బాంబులు పక్కదారి పడుతున్నాయంటూ ప్రజల్లో అనుమానాలు వ్యక్తమవుతున్నాయి. వివరాల్లోకి వెళితే మండల పరిధి తోగ్గూడెం గ్రామం పచ్చని ప్రకృతి ఒడిలో, సహజ వనరులతో ప్రశాంతంగా ఉంటుంది. ఆదివాసీ గిరిజన ప్రజలకు వ్యవసాయమే జీవనాధారం. గ్రామంలో ఉన్న సహజ వనరులే వారికి శాపమయింది. వాటిపై బడాబాబులపై కన్ను పడింది. తమ పలుకుబడితో అమాయకులను తమ దారికి తెచ్చుకొన్నారు. బినామీలుగా మార్చుకొన్నారు. పేరులోనే గిరిజనులు. పెత్తనమంతా గిరిజనేతరులదే. దోపిడీకి తెరలేపారు. సరిహద్దులను చెరిపేశారు. ఇష్టారీతిన మైనింగ్‌కు పాల్పడ్డారు. కోట్ల విలువైన సహజ సంపదను దోచుకొన్నారు. దీనితో ప్రశ్నించిన వారిని భయభ్రాంతులకు గురి చేశారు. అక్రమంగా దోచుకొన్న డబ్బు పలుకుబడితో అధికారులతో అక్రమ కేసులను బనాయించడానికి వెనుకాడలేదని ఆరోపణలు. ప్రభుత్వానికి చెల్లించాల్సిన సుమారు మూడు కోట్ల రాయల్టిని చెల్లించకుండా ఎగ్గొట్టారు. చెల్లించాలని పలుమార్లు నోటీసులు జారీ చేశారు. పట్టించుకోకుండా అధికారులను లెక్క చేయకుండా మైనింగ్ దోపిడీని యదేశ్చగా కొనసాగించారు. దీనితో గత్యంతరం లేని పరిస్థితిలో విద్యుత్ సరఫరాను నిలిపివేశారు. తిరిగి రెండు నెలలుగా అక్రమ పర్వానికి తెరలేపారు. జనరేటర్ల సాయంతో రిగ్గులు వేస్తూ మైనింగ్ నిర్వహిస్తున్నారు. సాయంత్రం ఆరు గంటలు అయిందంటే చాలు బాంబుల మోతలు మోగుతున్నాయి. ప్రతీ రోజు సుమారు 50 లక్షల విలువైన కంకర తరలిస్తూ ప్రభుత్వ సంపదను కొల్లగొడుతున్నారు. ఇంత జరుగుతున్నా అధికారులు పట్టించుకోకుండా చోద్యం చూస్తున్నారనే తీవ్రమైన ఆరోపణలు వ్యక్తమవుతున్నాయి. కాగా ఎంఎల్‌ఏ కూనంనేని సాంబశివరావులు వారి అక్రమ పర్వానికి సహాయ నిరాకరణ చేస్తున్నారంటూ దీనితో పలు శాఖల అధికారులకు పెద్ద ఎత్తున ముడుపులు చెల్లించాల్సి వస్తుందంటూ చాప కింద నీరులా ప్రచారం చేస్తూ కంకరను అధిక ధరలకు విక్రయిస్తూ భారీ ఎత్తున సొమ్ము చేసుకొంటున్నారనే వదంతులు పుకార్లు షికార్లు చేస్తున్నాయి. ఉన్నతాధికారులు స్పందించి తోగ్గూడెంలో సాగుతున్న అక్రమ మైనింగ్‌కు పాల్పడే వారిపై తగు చర్యలు తీసుకొని ప్రభుత్వ ఆదాయాన్ని కాపాడాలని పలువురు అంటున్నారు.

**అందుబాటులోకి రాని మైనింగ్ శాఖ అధికారి :** ఈ విషయంపై మైనింగ్ శాఖ ఏడిఈ దినేష్ కుమార్‌ను ఫోన్ ద్వారా వివరణ కోరటానికి ప్రయత్నించగా అందుబాటులోకి రాలేదు.

# అప్పు ఇస్తూ..నడ్డి విరుస్తున్న మైక్రో ఫైనాన్స్ సంస్థలు..!

**ప్రజాపక్షం/దమ్మపేట:** దమ్మపేట మండల వ్యాప్తంగా మైక్రో ఫైనాన్స్ సంస్థలు రిజర్వ్ బ్యాంక్ నిబంధనలను పాటించకుండా డబ్బులు అప్పు ఇస్తూ అధిక వడ్డీ లతో అమాయకపు ప్రజల నడ్డి విరుస్తున్నాయి. ఇప్పటి వరకు పెద్దపెద్ద నగరాలు పట్టణాలు, పారిశ్రామిక వాడలకు మాత్రమే పరిమితమైన మైక్రో ఫైనాన్స్ ఆగడాలు పల్లెలకు కూడా చేరాయి. కొన్ని కొన్ని ప్రాంతాల్లో గుట్టు చప్పుడు కాకుండా పెద్ద ఎత్తున బ్రాంచ్ లు తెరిచాయి. పేదలు, మధ్య తరగతి వారి ఆర్థిక అవసరాలను బలహీనతలు ఆసరాగా చేసుకొని వ్యాపారం చేస్తున్నాయి. అమాయక గిరిజన మహిళల టార్గెట్‌గా వారిని గ్రూపులుగా ఏర్పాటు చేసి అప్పులు ఇస్తున్నాయి. గ్రూపు లో ఒకరు కట్టకున్న మిగతా వారంతా కలిసి డబ్బు కట్టాలని నిబంధన పెట్టి బలవంతపు వసూళ్ళకు పాల్పడుతున్నాయి. ఒకవేళ వాయిదా కట్టకపోతే చస్తే చావండి డబ్బులు మాత్రం కట్టండి అంటూ తీవ్రంగా వేధింపులకు దిగుతున్నాయి. ఈ మైక్రో ఫైనాన్స్ వలలో చిక్కి ఎన్నో పేద, మధ్య తరగతి కుటుంబాలు విలవిలలాడుతున్నాయి. సంపాదించే కాసింత కూడా తీసుకున్న డబ్బులకు వడ్డీలకే సరిపోవటం లేదంటూ అవేదన చెందుతున్నారు. కొందరు అమాయక గిరిజనులు మద్యపానానికి బానిసలు అవుతున్నారు. అసలు కథ ఏంటి అంటే మైక్రో ఫైనాన్స్ సంస్థలు 10 నుంచి 20 మంది మహిళలను ఒక గ్రూపుగా చేసి ఎలాంటి సెక్యూరిటీ లేకుండా కేవలం ఆధార్ కార్డు, పాన్ కార్డు, జిరాక్స్ తీసుకొని రుణాలు ఇస్తున్నాయి. రిజర్వ్ బ్యాంక్ నిబంధనల పేరుతో బ్యాంకులుగా రిజిస్ట్రేషన్ చేయించుకుని చట్టబద్ధంగానే వ్యాపారం నిర్వహిస్తున్నట్లుగా రికార్డులో చూపుతున్నాయి. వివిధ పేర్లతో ముందుగానే ఇచ్చే డబ్బుల్లో కోతలు పెడుతున్నాయి. మొత్తం డబ్బులకు వడ్డీలు వసూలు చేస్తున్నాయి. ఉదాహరణకు ఒక గ్రూపులో ఒక్కో మహిళకు 30,000 చొప్పున అప్పుగా ఇస్తారు అందులోని బీమా, ప్రాసెసింగ్ ఫీజు పేరిట 2000 రూపాయలు ముందే కోతపెడతారు. 28000 మాత్రమే మహిళలు చేతికి ఇస్తారు. ఈ అసలు వడ్డీ కలిపి వారానికి 800 చొప్పున ఏడాది పాటు చెల్లించాలి. అంటే 28, 000 రూపాయలకు గాను మొత్తంగా 44800 రూపాయలు కట్టాల్సి ఉంటుంది. అంతేకాదు ఏ వారమైన వాయిదా సమయానికి చెల్లించకుంటే అదనంగా 100 జరిమానా కింద వసూలు చేస్తారు.

### మైక్రో ఫైనాన్స్ లక్ష్యం పక్కదారి పట్టింది...

మైక్రో ఫైనాన్స్ ల అసలు లక్ష్యం పేదలకు తక్కువ మొత్తంలో రుణాలు సులువుగా అందించడం ఆర్థిక చేయూత ద్వారా పేదరికం తగ్గించటం లక్ష్యంగా మైక్రో ఫైనాన్స్ వ్యవస్థ యొక్క ముఖ్య లక్ష్యం. సూక్ష్మ రుణాల ద్వారా వ్యక్తులు కొత్త వ్యాపారాలు ప్రారంభించడానికి విస్తరించడానికి తోడ్పడాలి. కానీ ఇక్కడ అందుకు పూర్తిగా భిన్నంగా జరుగుతుంది. అనేక ప్రాంతాల్లో విస్తరించిన టాప్ మైక్రో ఫైనాన్స్ సంస్థలు మండలంలో ప్రతి మారుమూల గ్రామలలో పాగా వేశాయి. 8000 నుంచి 50 వేల రూపాయల వరకు మహిళలను గ్రూపులుగా ఏర్పాటు చేసి రుణాలు ఇస్తున్నాయి. రుణాలు ఇచ్చే సమయంలోనే కాలపరిమితి బట్టి 36% వరకు వడ్డీ పడుతుందని ఒప్పంద పత్రములలో పేర్కొంటున్నాయి. ఒక్కో సంస్థకు ఒక్కోరకంగా డాక్యుమెంట్ ప్రాసెసింగ్ ఫీస్ జి ఎస్ టి, బీమా వంటి వాటి పేరు మీద 2000 నుంచి 4000 వరకు రుణములో ముందే కోత పెడుతున్నాయి. అన్నీ కలిపి లెక్కేస్తే పేరుకు 36% అయినా 50% దాకా వడ్డీ పడుతున్న ఈ వడ్డీల భారం భరించలేక అమాయక ప్రజలు ఆర్థిక ఇబ్బందుల్లో పడుతున్నారు.

**చేసిన కష్టమంతా వడ్డీ రూపంలో పోతుంది....**

చిన్న వ్యాపారానికి ఇంట్లో అవసరానికి మైక్రో ఫైనాన్స్ లో రుణం తీసుకున్న వారం వారం చెల్లించాలి రోజు కూలి నాలి పనులకు వెళ్లి వచ్చే మొత్తంలో కొంత ఇంటి అవసరానికి పోగగా, మిగతావి ఫైనాన్స్ చెల్లిస్తూ ఉంటున్నారు. ఒక్కసారి ఆరోగ్యం బాగోక పోయిన వాయిదా మాత్రం చెల్లించాల్సి వస్తుంది. ఏమాత్రం ఆలస్యమేనా జమానత్ ఉన్న వారిపై ఒత్తిడి తేస్తున్నారు. వారు వారం కట్టే డబ్బు మొత్తం కూడా కేవలం వడ్డీకే సరిపోతుంది.

# ఎస్‌విఎం పాఠశాలలో బతుకమ్మ వేడుకలు

**ప్రజాపక్షం/ ఖమ్మం అర్బన్ :** ఖమ్మం నగరంలోని ఎస్‌విఎం సెంట్రల్ పబ్లిక్ పాఠశాలలో బతుకమ్మ వేడుకలను ఘనంగా నిర్వహించారు. శనివారం పాఠశాలలో బతుకమ్మ వేడుకలతో పాటు దసరా సంబురాలు నిర్వహించారు. విద్యార్థులు సాంప్రదాయ దుస్తులు ధరించి పాఠశాలకు వచ్చారు. వివిధ రకాల పూలతో బతుకమ్మలను అందంగా పేర్చి ఆటపాటలతో సంబురాలు నిర్వహించారు.ఈ సందర్భంగా పాఠశాల డైరెక్టర్లు డా॥ కిషోర్, కొండా శ్రీధర్, ఉమాకిషోర్ లు మాట్లాడుతూ తెలంగాణ ప్రాంతంలో బతుకమ్మ పండుగకు చాలా ప్రాముఖ్యత ఉందన్నారు. వివిధ రకాల పూలతో బతుకమ్మల సంబురాలు నిర్వహిస్తారని తెలిపారు. చెడుపై మంచి ఎప్పుడు విజయం సాధిస్తుందన్నారు. ఈ సందర్భంగా రావణవర కార్యక్రమాన్ని నిర్వహించారు. ఈ కార్యక్రమంలో ప్రిన్సిపాల్ ప్రసాద్, ఉపాధ్యాయులు, విద్యార్థులు తదితరులు పాల్గొన్నారు.



# అక్రమంగా మట్టి తరలిస్తే కఠిన చర్యలు

**-తహసీల్దార్ ఉషా శారద**



**ప్రజాపక్షం/ఎర్రుపాలెం :** అనుమతులు లేకుండా అక్రమంగా ప్రభుత్వ, ప్రైవేటు గుట్టల నుండి మట్టిని తరలిస్తే కఠిన చర్యలు తీసుకోవడం జరుగుతుందని తహసీల్దార్ ఉషా శారద తెలిపారు. ఎర్రుపాలెం తహసీల్దార్ కార్యాలయంలో శనివారం ఏర్పాటు చేసిన విలేకరుల సమావేశంలో తహసీల్దార్ మాట్లాడుతూ మండలంలో మామూనూరు రెవెన్యూలో సర్వే నెంబర్ 343లో 5.30 ఎకరాలు, రాజుపాలెం రెవెన్యూలో సర్వే నెంబర్ 102లో 9.18 ఎకరాలు, తాటిగూడెం రెవెన్యూలో సర్వే నెంబర్ 31లో 2.20 ఎకరాలు, పెద్దగోపవరం రెవెన్యూలో సర్వే నెంబర్ 123లో 9.30 ఎకరాలు, 186లో 5.10 ఎకరాలకు మాత్రమే ప్రభుత్వ అనుమతులు ఉన్నాయన్నారు. అనుమతులు ఉన్న క్వారీల నుంచే గ్రావెల్ తొలకాలు జరపాలని లేని పక్షంలో అక్రమంగా తోలకాలు జరిపే వారిపై చట్ట ప్రకారం తగు చర్యలు చేపడతామని హెచ్చరించారు. ఈ సమావేశంలో ఆర్ఐలు రవికుమార్, జగదీష్ తదితరులు పాల్గొన్నారు.

# అక్రమ ఇసుక, మట్టి రవాణా నియంత్రణకు చర్యలు

**-ఇసుక, గనుల వివరాల రిపోర్టు అందించండి**
**-డిఎస్ఆర్ సమావేశంలో కలెక్టర్**




**ప్రజాపక్షం/ఖమ్మం అర్బన్ :** అక్రమ ఇసుక, మట్టి రవాణా నియంత్రణకు ప్రణాళికాబద్ధంగా చర్యలు తీసుకోవాలని జిల్లా కలెక్టర్ అనుదీప్ దురిశెట్టి అధికారులను ఆదేశించారు. కలెక్టర్ అనుదీప్ దురిశెట్టి తన క్యాంపు కార్యాలయంలో అదనపు కలెక్టర్ పి. శ్రీనివాసరెడ్డి, డిఎఫ్‌వో సిద్దార్థ్ విక్రం సింగ్, సంబంధిత అధికారులతో కలిసి డిఎస్ఆర్ కమిటీ సమావేశం నిర్వహించారు.ఈ సందర్భంగా కలెక్టర్ మాట్లాడుతూ జిల్లాలోని ప్రతి మండలం వారీగా అందుబాటులో ఉన్న ఇసుక వనరులు, ఇతర గనుల వివరాలకు సంబంధించిన సర్వే రిపోర్టు తయారు చేసి అందించాలన్నారు. ఇసుక, మట్టి అక్రమ రవాణా అంశంలో నియంత్రణ సాధించాలని పత్రికల్లో తరచూ అక్రమ ఇసుక, మట్టి రవాణాపై వార్తలు వస్తున్నాయని, పెద్దగా స్పందన ఉండడం లేదని దీనిని వెంటనే సవరించాలని కలెక్టర్ ఆదేశించారు. జిల్లాలో ఇసుక, మట్టి రవాణా కోసం జారీ చేసిన అనుమతులను సమీక్షించుకుని నిబంధనలు అమలవుతున్నాయో లేదో నిరంతరం పరిశీలించాలన్నారు. ఇందిరమ్మ ఇండ్ల పేరుతో కూడా అక్రమ రవాణా జరుగుతున్నట్లు సమాచారం వస్తుందని, మనం జారీ చేసిన అనుమతుల మేరకే ఇసుక రవాణా జరిగేలా పర్యవేక్షించాలన్నారు. జిల్లాలో అక్రమ ఇసుక, మట్టి రవాణాను అరికట్టేందుకు ఆకస్మిక తనిఖీలు పెంచాలన్నారు. ప్రతి మండల పరిధిలోని ఆకస్మిక తనిఖీలు చేసి అధికారులు రిపోర్టులు అందించాలని కలెక్టర్ ఆదేశించారు. మైనింగ్, రెవెన్యూ, పోలీస్ శాఖాధికారులు సమన్వయంతో పనిచేస్తూ ఎక్కడ అక్రమ రవాణా జరగకుండా చూడాలన్నారు.ఈ సమావేశంలో సిపివో ఎ. శ్రీనివాస్, భూగర్భ గనుల సహాయ సంచాలకులు ఆర్. సాయినాథ్, టిజిఎండిసి ప్రాజెక్టు ఆఫీసర్ శంకర్, గ్రౌండ్ వాటర్, ఇరిగేషన్, సంబంధిత అధికారులు తదితరులు పాల్గొన్నారు.

# ముగ్గురు అంతర్‌జిల్లా దొంగల అరెస్ట్

**- రూ.21లక్షల విలువైన 190గ్రాముల బంగారు ఆభరణాలు స్వాధీనం**
**- వివరాలు వెల్లడించిన ఖమ్మంరూరల్ ఏసీపీ తిరుపతిరెడ్డి**



**ప్రజాపక్షం/ఖమ్మంరూరల్ :** బంగారు ఆభరణలను అపహరిస్తున్న ముగ్గురు అంతర్‌జిల్లా దొంగలను ఖమ్మంరూరల్ పోలీసులు శనివారం అరెస్ట్ చేశారు. ఇందుకు సంబంధించిన వివరాలను ఏసీపీ తిరుపతిరెడ్డి వెల్లడించారు. రఘునాథపాలెం మండలంలోని రేగులచెలక గ్రామానికి చెందిన జంగం వెంకన్న( పేంటర్), వల్లెబోయిన లక్ష్మ ణ్‌రావ్ (ట్రాక్టర్ డ్రైవర్), భద్రాద్రి కొత్తగూడెం జిల్లా ఎదురుగడ్డ మండలం గొల్లగూడెం గ్రామానికి చెందిన వల్లపు సుమంత్(కార్‌డ్రైవర్) ఓ ముఠాగా ఏర్పడ్డారు. వీరు ఖమ్మంరూరల్ మండలంలోని కామంచికల్, గొల్ల గూడెంలోని నందనవనంటౌన్ షిప్, మద్దులపల్లిలో, ఖమ్మంలోని ఖానపురం, నేలకొండపల్లి, కల్లూరు, రఘునాథపాలెం, కోటపాడులో దొంగతనాలకు పాల్పడగా పోలీస్ స్టేషన్లు కేసులు నమోదయ్యాయి. అంతేకాకుండా భద్రాదికొత్తగూడెం జిల్లాలోని సుజాతనగర్ పోలీస్ స్టేషన్‌లో దొంగతనంపై కేసు నమోదయ్యింది. ఈ కేసులపై ఖమ్మంరూరల్, సిసిఎస్ పోలీసులు సంయుక్తంగా దర్యాప్తు చేపట్టి నిందితులను చాకచక్యంగా పటుకున్నారు. విచారించగా పై దొంగతనాలకు పాల్పడినట్టుగా ఒప్పుకున్నారు. సదరు నిందితుల నుంచి రూ.21లక్షల విలువైన 190గ్రాముల బంగారు అభరణాలను స్వాధీన పరుచుకుని రిమాండ్‌కు తరలించారు. కేసులను ఛేధించిన కానిస్టేబుల్‌లు శ్రీనివాస్, దశరథ్, నాగేంద్రప్రసాద్, సంజీవ్‌కుమార్, హరికృష్ణ, నరసింహారావు, సుధీర్, సంజీవ్, జానీపాషా, మంగిత్యాను ఏసీపీ అభినందించారు. ఈ కార్యక్రమంలో ఖమ్మంరూరల్ సర్కిల్ ఇన్స్‌పెక్టర్ ముష్క రాజు, సిసిఎస్ ఎస్ఐ శ్రీనివాస్, ఎస్ఐ విశ్వతేజ్, కానిస్టేబుల్‌లు నాగేశ్వరరావు, రాజేష్ తదితరులు పాల్గొన్నారు.

# పింఛన్‌దారులకు ఇచ్చిన హామీలను అమలు చేయాలి

**ప్రజాపక్షం/ రఘునాథపాలెం :** ముఖ్యమంత్రి రేవంత్‌రెడ్డి పింఛన్‌దారులకు ఇచ్చిన హామలను అమలు చేయాలని ఎంఆర్‌పిఎస్ రఘునాథపాలెం మండల అధ్యక్షులు మందా గోపాలరావు తెలిపారు. శనివారం మండల పరిధిలోని మంచుకొండ పంచాయతీ కార్యాలయం వద్ద కార్యదర్శికి ఎంఆర్‌పిఎస్ ఆధ్వర్యంలో వినతి పత్రం సమర్పించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ముఖ్యమంత్రి రేవంత్‌రెడ్డి ఎన్నికల సమయంలో అధికారంలోకి వచ్చిన వెంటనే ప్రస్తుతం ఉన్న పింఛన్లను పెంచి ఇస్తామని హామీ ఇచ్చారన్నారు. అధికారంలోకి వచ్చి రెండేళ్లు కావస్తున్నా పింఛన్ల ఊసే లేదన్నారు. తక్షణమే దివ్యాంగులకు ఆరు వేలు, వితంతువులు, వృద్ధులు, ఒంటరి మహిళలకు నాలుగు వేల చొప్పున పెంచి పింఛన్లను అందించాలన్నారు. అర్హులైన వారికి కూడా కొత్త పింఛన్లు మంజూరు చేయాలన్నారు. ఈ కార్యక్రమంలో పింఛన్‌దారులు మందా పిచ్చయ్య, మందా గురవయ్య, మందా భాస్కర్, కోట



సైదులు, మందా లింగయ్య, దంతాల రామకృష్ణ, బాలమ్మ, పుష్పమ్మ, లింగమ్మ, వెంకటరమణ, సుక్కమ్మ తదితరులు పాల్గొన్నారు.

# టీకాలతో ఆరోగ్యానికి భరోసా

**-డిఎంఅండ్‌హెచ్‌వో కళావతిబాయి**



**ప్రజాపక్షం/ ఖమ్మం అర్బన్ :** టీకాలతో ఆరోగ్యానికి భరోసా లభిస్తుందని డిఎంఅండ్‌హెచ్‌వో డాక్టర్ కళావతిబాయి తెలిపారు. శనివారం డిఎంఅండ్‌హెచ్‌వో కళావతిబాయి మంచుకొండ పిహెచ్‌సి పరిధిలోని ఖమ్మం నగరంలో గల రస్తోగి నగర్ అంగన్‌వాడీ కేంద్రంలో నిర్వహించిన సార్వత్రిక టీకాల కార్యక్రమాన్ని పరిశీలించారు. ఈ సందర్భంగా లబ్దిదారుల జాబితాను పరిశీలించారు. అర్హులైన పిల్లలు, తల్లులు టీకాలు పొందుతున్నారా అనే అంశాన్ని పరిశీలించారు. అనంతరం పిహెచ్‌సిలోని వ్యాక్సిన్ రిఫ్రిజిరేటర్‌ను, ఐస్ ప్యాక్స్ నాణ్యతను పరిశీలించారు. సిబ్బంది టీకాలు అందిస్తున్న విధానాన్ని పరిశీలించారు. టీకాల నిల్వను పరిశీలించారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ టీకాల యొక్క ప్రాముఖ్యత గురించి తల్లిదండ్రులకు తెలియజేయాలన్నారు. జిల్లాలో సమగ్ర టీకా కవరేజీ వంద శాతం చేయాలన్నారు. సిబ్బంది సమయపాలన, క్రమశిక్షణతో విధులు నిర్వహిస్తూ రికార్డుల నిర్వహణ సజావుగా చేపట్టాలన్నారు.

# అక్టోబర్ ఆరు లోపు మైనార్టీలు దరఖాస్తులు సమర్పించాలి

**-జిల్లా మైనార్టీ సంక్షేమ అధికారి ముహమ్మద్ ముజాహిద్**

**ప్రజాపక్షం/ ఖమ్మం అర్బన్ :** మైనార్టీల కొరకు ఇందిరమ్మ మైనార్టీ మహిళా యోజన, రేవంతన్న కా సహారా పథకాలను ప్రభుత్వం ప్రారంభించిందని ఈ పథకాల క్రింద అందించనున్న సహాయం కొరకు జిల్లాలోని అర్హులైన మైనార్టీ మహిళలు, ఫకీర్, దూదేకులు అక్టోబర్ ఆరు లోపు ఆన్‌లైన్‌లో దరఖాస్తు చేసుకోవాలని జిల్లా మైనార్టీ సంక్షేమ అధికారి ముహమ్మద్ ముజాహిద్ శనివారం ఒక ప్రకటనలో తెలిపారు. ఇందిరమ్మ మైనార్టీ మహిళా యోజన పథకం క్రింద వితంతువులు, విడాకులు పొందిన వారు, అనాథలు, అవివాహిత మహిళలకు చిన్న వ్యాపారాల కొరకు ఒక్కొక్కరికి రూ. 50వేల సహాయం రేవంతన్నా కా సహారా పథకం క్రింద ఫకీర్, దూదేకుల వర్గాలకు మోపెడ్ వాహనాల కొరకు ఒక్కొక్కరికి లక్ష గ్రాంట్ అందజేయనున్నట్లు ఆయన తెలిపారు.https://tgobmms.cgg.gov.in వెబ్‌సైట్‌లో దరఖాస్తు చేసుకోవాలన్నారు. ఇతర వివరాలకు 9704003002 ఫోన్ నెంబర్ నందు సంప్రదించాలని జిల్లా మైనార్టీ సంక్షేమ శాఖాధికారి ముహమ్మద్ ముజాహిద్ ప్రకటనలో పేర్కొన్నారు.

# స్టెమ్‌స్పార్క్ రెజొనెన్స్‌లో బతుకమ్మ సంబురాలు




**ప్రజాపక్షం/ ఖమ్మం అర్బన్ :** ఖమ్మం నగరం శ్రీనగర్ కాలనీలోని స్టెమ్‌స్పార్క్ రెజొనెన్స్ పాఠశాలలో పూల పండుగైనా బతుకమ్మ వేడుకలను ఘనంగా నిర్వహించారు. శనివారం పాఠశాలలో నిర్వహించిన బతుకమ్మ సంబురాల్లో తెలంగాణ సంస్కృతి, సాంప్రదాయాలు ఉట్టిపడేలా ఆడపిల్లలు బతుకమ్మ ఆటపాటలతో, మహంకాళి అమ్మవారి వేషధారణతో కనువిందు చేశారు. వివిధ రకాల పూలతో బతుకమ్మలను అందంగా పేర్చారు.ఈ సందర్భంగా పాఠశాల డైరెక్టర్లు కొండా శ్రీధర్‌రావు, కొండా కృష్ణవేణి లు మాట్లాడుతూ తెలంగాణ ప్రాంతానికే ప్రత్యేకమైన ఈ పండుగను ప్రాచీన కాలం నుండి సంప్రదాయంగా జరుపుకుంటున్నామన్నారు. వివిధ రకాల పూలను బతుకమ్మగా పేర్చి తొమ్మిది రోజుల పాటు ఈ పండుగను జరుపుకుంటారన్నారు. మన సంస్కృతి, సాంప్రదాయాలను చిన్నతనం నుంచే నేర్చుకునేలా తమ పాఠశాలలో ఇలాంటి కార్యక్రమాలు నిర్వహిస్తున్నట్లు వారు తెలిపారు. ఈ కార్యక్రమంలో ప్రిన్సిపాల్ పివిఆర్ మురళిమోహన్, ఉపాధ్యాయులు, విద్యార్థులు తదితరులు పాల్గొన్నారు.

# సర్వజ్ఞలో బతుకమ్మ వేడుకలు




**ప్రజాపక్షం/ఖమ్మం అర్బన్ :** ఖమ్మం నగరంలోని వీడియోస్ కాలనీలో గల సర్వజ్ఞ పాఠశాలలో బతుకమ్మ వేడుకలను ఘనంగా నిర్వహించారు. శనివారం పాఠశాలలో నిర్వహించిన బతుకమ్మ వేడుకల్లో విద్యార్థులు ఉత్సాహంగా పాల్గొన్నారు. వివిధ రకాల పూలతో బతుకమ్మలను అందంగా పేర్చారు. బతుకమ్మ ఆటపాటలతో సందడి చేశారు. ఈ సందర్భంగా డైరెక్టర్లు ఆర్‌వి నాగేంద్రకుమార్, నీలిమ లు మాట్లాడుతూ బతుకమ్మ పండుగ ప్రాముఖ్యత గురించి విద్యార్థులకు వివరించారు. తెలంగాణకే ప్రత్యేకమైన బతుకమ్మను తొమ్మిది రోజుల పాటు వేడుకగా నగరాలు, పల్లెలు అనే తేడాలు లేకుండా జరుపుకుంటారన్నారు. ప్రకృతిని పూజించే పండుగ బతుకమ్మ అన్నారు. మన సంస్కృతి, సాంప్రదాయాలు, కట్టుబాట్లను భావితరాలకు అందించే గొప్ప వారసత్వమన్నారు. ఈ కార్యక్రమంలో ప్రిన్సిపాల్, ఉపాధ్యాయులు, విద్యార్థులు తదితరులు పాల్గొన్నారు.

# టిఎస్‌డబ్ల్యూఆర్‌డిసిలో బతుకమ్మ సంబరాలు



**ప్రజాపక్షం/ఖమ్మంరూరల్ :** ఏదులాపురం మున్సిపాలిటీ పరిధిలోని మద్దులపల్లిలలో గల తెలంగాణ సాంఘీక సంక్షేమ గురుకుల మహిళా డిగ్రీ కళాశాల(టిఎస్‌డబ్ల్యుర్‌డిసి) ఖమ్మంలో ముందస్తు బతుకమ్మ సంబరాలను శనివారం ఘనంగా నిర్వహించారు. కళాశాల ప్రిన్సిపల్ డాక్టర్ ఎం సునీత, వైస్ ప్రిన్సిపల్ డాక్టర్ ఏ.సునీత విద్యార్థులతో కలిసి రంగురంగుల పువ్వులతో బతుకమ్మలను పేర్చారు. వాటన్నింటిని ఓ దగ్గర ఉంచి బతుకమ్మ పాటలను పాడుతూ నృత్యాలు చేశారు. ఈ కార్యక్రమంలో అధ్యాపకులు, బోధన, బోధనేతర సిబ్బంది పాల్గొని ఆనందంగా గడిపారు.

# ఎమ్మార్పీఎస్ ఆధ్వర్యంలో ఇఎంసి కార్యాలయం ముట్టడి



**ప్రజాపక్షం/ఖమ్మంరూరల్ :** ఎమ్మాఆర్పిఎస్ వ్యవస్థాపక అధ్యక్షుడు మందకృష్ణ మాదిగ ఇచ్చిన పిలుపు మేరకు ఏదులాపురంమున్సిపాలిటీ కార్యాలయాన్ని వికలాంగులతో కలిసి ఖమ్మంరూరల్ మండలం ఎమ్మాఆర్పిఎస్ ఆధ్వర్యంలో శనివారం ముట్టడించారు. సీఎం రేవంత్‌రెడ్డి వికలాంగులకు ఇచ్చిన హామీ ప్రకారం ఫించన్‌లను అందజేయాలని నినాదాలు చేశారు. అనంతరం సమస్యలతో కూడిన వినతిపత్రాన్ని కమిషనర్ ఆళ్ల శ్రీనివాస్‌రెడ్డికి అందజేశారు. ఈ కార్యక్రమంలో బిజెపి నాయకులు హలవత్ సురేష్‌నాయక్, బాన్యా నాయక్, సైదులు నాయక్, ఎమ్మాఆర్పిఎస్ నాయకులు కనకం జనార్థన్‌మాదిగ, సిరిపురపు బొందయ్యమాదిగ, వెంకటయ్య, దూరపల్లి మైబుజీ తదితరులు పాల్గొన్నారు.

## ఘనంగా బతుకమ్మ వేడుకలు



**ప్రజాపక్షం/కారేపల్లి:** ప్రాథమిక పాఠశాల మోకాళ్ళగుంపులో ప్రధానోపాధ్యాయులు అజ్మీరా వీరు నాయక్, సహా ఉపాధ్యాయులు బానోత్ మంగీలాల్ ఆధ్వర్యంలో బతుకమ్మ వేడుకలను ఘనంగా నిర్వహించారు. విద్యార్థులు స్వయంగా వివిధ రకాల పూలను సేకరించి స్వయంగా వివిధ రకాల పూలతో బతుకమ్మలు అద్భుతంగా చక్కగా తయారు చేసి బతుకమ్మలతో ఆట, పాటలతో విద్యార్థులు నృత్యం చేశారు. ఈకార్యక్రమంలో విద్యార్థుల తల్లులు కూడా భారీ ఎత్తున పాల్గొని డీజె పాటలతో బతుకమ్మ నృత్యాలను చేశారు. గ్రామ మహిళలు కూడా వచ్చి బతుకమ్మ ఆటపాటలతో విద్యార్థులను ఉత్తేజం పరిచ్చారు. అనంతరం బతుకమ్మలను దగ్గర్లో ఉన్న నీటి కాలువలో నిమజ్జనం చేశారు. ఈకార్యక్రమంలో మహిళా సమైక్య అధ్యక్షురాలు అనూష, సంగీత, వెంకటరమణ, అరుణ, తదితరులు పాల్గొన్నారు.

## ఘనంగా బతుకమ్మ వేడుకలు



**ప్రజాపక్షం/కూసుమంచి:** మండల కేంద్రంలోని ప్రగతి విద్యాలయంలో శనివారం బతుకమ్మ వేడుకలను ఘనంగా నిర్వహించారు. విద్యార్థులకు దసరా సెలవుల నేపథ్యంలో ఒక రోజు ముందుగానే మండలంలోని వివిధ ప్రభుత్వ, ప్రైవేట్ పాఠశాలల్లో విద్యార్థులు ఉపాధ్యాయులు విద్యార్థిని విద్యార్థులు అందరూ బతుకమ్మ వేడుకలను ఘనంగా నిర్వహించారు. ఈకార్యక్రమంలో ప్రగతి విద్యాలయంలో ఉపాధ్యాయుని, ఉపాధ్యాయులు పాల్గొనగా, ఇంకా మండలంలోని వివిధ ప్రభుత్వ పాఠశాలలో ఉపాధ్యాయుని, ఉపాధ్యాయులు అందరూ విద్యార్థులకు ముందుగానే బతుకమ్మ పండుగ శుభాకాంక్షలు తెలుపుతూ దసరా పండుగ సందర్భంగా ఈ సెలవుల్లో విద్యార్థులందరూ ఇంటి దగ్గర జాగ్రత్తగా ఉండి మంచిగా చదువుకోవాలని శుభాకాంక్షలు తెలిపారు.

## అరుణోదయలో బతుకమ్మ వేడుకలు



**ప్రజాపక్షం/మణుగూరు:** తెలంగాణ సంస్కృతి సాంప్రదాయాలతో కూడిన బతుకమ్మ పండుగను అరుణోదయ విద్యాలయంలో శనివారం ఘనంగా ఆటపాటలతో ఎంత ఉత్సాహంగా నిర్వహించారు. ఈ సందర్భంగా బతుకమ్మ పండుగ ఉద్దేశించి కరస్పాండెంట్ మాదాస్ అరవింద్ కుమార్ మాట్లాడుతూ విద్యార్థులకు బతుకమ్మ పండుగ గురించి చెబుతూ పకృతి సమ్మేళనంతో కూడిన బతుకమ్మ పండగ విశిష్టత గురించి వివరించారు. ఈ బతుకమ్మ వేడుకల్లో పాల్గొన్న విద్యార్థులకు సహకరించిన ఉపాధ్యాయిని ఉపాధ్యాయులకు ప్రశంసలు తెలిపారు

## బతుకమ్మలు ఆడే ప్రదేశాల్లో వసతులు కల్పించాలి

**ప్రజాపక్షం/మణుగూరు:** బతుకమ్మలు ఆడే ప్రదేశాల్లో గ్రామాలలోమహిళలకు ఇబ్బంది లేకుండా అన్ని వసతులు, అధికారులు కల్పించేలా చర్యలు చేపట్టాలని సిపిఐ మణుగూరు పట్టణ కార్యదర్శి దుర్గ్యాల సుధాకర్ ఒక ప్రకటనలో డిమాండ్ చేశారు. మణుగూరు మున్సిపాలిటీ పరిధిలోని గ్రామాలలో ఈ నెల 21 నుండి తొమ్మిది రోజుల పాటు మహిళలకు ప్రతిష్టాత్మకంగా జరుగు బతుకమ్మ పండుగ నిర్వహిస్తారని దీనికి మున్సిపల్ అధికారులు అన్ని ఏర్పాటు చేయాలని, అన్ని వార్డులలో బతుకమ్మ ఆడే ప్రదేశాలలో శుభ్రపరచి, విద్యుత్ లైట్ల అలంకరణతో ఎలాంటి ఇబ్బందులు లేకుండా చూడాలని, ప్రతి సంవత్సరం లాగానే ఈ సంవత్సరం కూడా బతుకమ్మ పండుగకు అధికారులు అన్ని ఏర్పాట్లు చేయాలని వారు అన్నారు. తెలంగాణలో మహిళలకు అతిపెద్ద పండుగ అయిన దసరా బతుకమ్మ పండుగ ఉత్సాహపరితంగా తీరొక రకం పూలతో బతుకమ్మ పండుగను ఘనంగా నిర్వహిస్తారని, పుట్టింటి నుండి వచ్చిన ప్రతి ఆడపిల్ల, మెట్టి నుండి వచ్చిన మహిళలు ఈ వేడుకల్లో పాల్గొని పండుగను జరుపుకుంటారన్నారు. బతుకమ్మ పండుగను దాని యొక్క ప్రాముఖ్యతను విశిష్టతను తెలుసుకొని కలిసిమెలిసి ఐక్యతతో నిర్వహిస్తారని, దీనిని అధికారులు దృష్టిలో పెట్టుకొని ఎలాంటి ఇబ్బంది లేకుండా చూడాలని వారు ఆ ప్రకటనలో కోరారు.

## మొహమ్మద్ ఇంటిపేరుగల వారికి బీసీ ఈ సర్టిఫికెట్లు జారీకి ఎమ్మార్వో అంగీకారం



**ప్రజాపక్షం/మణుగూరు:** మణుగూరులో గత కొన్ని రోజులుగా మొహమ్మద్ ఇంటి పేరుగల వారికి బీసీ ఈ సర్టిఫికెట్ల జారీపై ఏర్పడిన సందేహాలు తొలగిపోయాయి. బిఆర్ఎస్ పార్టీ మైనారిటీ సీనియర్ నాయకులు ఎండి హబీబ్ ఆధారాలతో వినతి పత్రం సమర్పించడంతో, 2015 చట్టం ప్రకారం మొహమ్మద్ ఇంటిపేరుగల వారు ముస్లిం బీసీ ఈ కేటగిరీకి చెందుతారని ఎమ్మార్వో సానుకూలంగా స్పందించారు. దీంతో ఇకపై మొహమ్మద్ ఇంటి పేరుగల అభ్యర్థులకు ఎటువంటి ఆటంకం లేకుండా బీసీ ఈ సర్టిఫికెట్లు జారీ చేయాలని ఎమ్మార్వో తెలిపారు. ఈ నిర్ణయంపై మైనారిటీ సోదరులు ఆనందాన్ని వ్యక్తం చేశారు. కార్యక్రమంలో అల్తాఫ్ షరీఫ్, జఫూర్, మాజీ కోఆప్షన్ సభ్యులు జావిద్, పాషా, ఎస్.కె ఫహీం, అంజద్, షేక్ ఇమ్రాన్, ఎండి అర్షద్, సాధిఖ్, ఎండి షబ్బీర్, హసీనా, రిహానా, జహేదా, రుబీనా తదితరులు పాల్గొన్నారు.

# 'ఉల్లాస్' లక్ష్యం నెరవేరేనా..!

**నిరక్షరాస్యులను అక్షరాస్యులుగా చేయడమే లక్ష్యం**





**ప్రజాపక్షం/నేలకొండపల్లి :** నిరక్షరాస్యులను అక్షరాస్యులుగా చేయాలనే లక్ష్యంతో ప్రభుత్వాలు ఉల్లాస్ కార్యక్రమంను చేపట్టింది. కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలు ప్రయత్నాలు ఫలించాలని గతంలో అనేక కార్యక్రమాలు చేపట్టారు. కానీ అవి మొక్కుబడిగా సాగటంతో అశించిన స్థాయిలో ఫలితం ఇవ్వలేదు. ఈ సారి కేంద్రం నవభారత్ సాక్షరాస్యత (న్యూ ఇండియా లిటరసీ పోగ్రాం) కార్యక్రమంకు శ్రీకారం చుట్టింది. 15 ఏళ్ల కు పైబడిన నిరక్షరాస్యులను గుర్తించాలని ఆదేశించింది. తొలి విడత లో మహిళలకు ప్రాధాన్యం కల్పించారు. నిరక్షరాస్యులను గుర్తించి ఉల్లాస్ యాప్ లో నమోదు చేస్తున్నారు. గత తప్పిదాలు అధిగమిస్తేనే అక్షరం పరిమిళంచనున్నది.

### కేంద్రాలకు చేరుతున్న పుస్తకాలు...

స్వశక్తి సంఘాల మహిళలు, ఉపాధి హామీ పథకం కూలీలు, ఐసీడీఎస్ లబ్ధిదారులలో నిరక్షరాస్యుల గుర్తింపులో ప్రాధాన్యం కల్పించనున్నారు. రాయటం, చదవటం, చిన్న చిన్న లెక్కలు చేయటం నేర్పిస్తారు. వంద రోజులలో నేర్పించి వీరికి తుది పరీక్షలు నిర్వహించనున్నారు. అందుకు తగ్గట్టుగా ఇప్పటికే కేంద్రాలకు చేరుకున్నాయి. పరీక్షలలో ఫలితాలు సాధించిన వారికి ధ్రువపత్రాలు పంపిణీ చేస్తారు. ఆర్థిక అవగాహన , సాంకేతిక అక్షరాస్యత, న్యాయ పరిజ్ఞానం పై శిక్షణ కుటుంబం, సంక్షేమం పై అవగాహన కల్పించనున్నారు. అక్షరాస్యత ను సాధించి జిల్లాలోనే ఆదర్శంగా నిలవాలని అన్ని మండలాలలో విద్యాశాఖాధికారులకు బాధ్యతలు అప్పగించారు.

### నిరక్షరాస్యుల గుర్తింపు కోసం సర్వే...

మహిళల నిరక్షరాస్యత అమాయకత్వం ను ఆసరాగా చేసుకుని కొందరు సంఘాలలో లావాదేవీలలో సొమ్ము స్వాహా చేస్తున్నారు. ఖమ్మం జిల్లాలో వేలాది మంది నిరక్షరాస్యులను గుర్తించారు. ఇంకా గ్రామాలలో సర్వే కొనసాగుతుంది. వారిని ఉల్లాస్ యాప్ లో నమోదు చేస్తున్నారు. సంఘాలలోని ఓత్సాహిక మహిళల ను వాలంటీర్లుగా నియమించి శిక్షణ ఇచ్చారు. జిల్లాలో చాలా చోట్ల ఐకేపీ సంఘాల సభ్యులను వాలంటీర్ల గా నియమించారు. కాగా వారికి కనీసం ప్రోత్సాహకంగా వేతనాలు అందించాలని డిమాండ్ చేస్తున్నారు. పాఠశాల పరిధిలో ఉపాధ్యాయులు పర్యవేక్షణ బాధ్యతలు అప్పగించారు. తమ తల్లిదండ్రులను అక్షరాస్యులు గా తీర్చిదిద్దేందుకు పిల్లలకు దిశా నిర్దేశం చేస్తున్నారు.

### లోపాలపై దృష్టి సారిస్తే మంచిది...

సాక్షర భారత్‌లో వాలంటీర్ల కు పంపిణీ చేసిన పుస్తకాలు లబ్ధిదారులకు చేరుకోలేదు. నామమాత్రంగా అర్హత పరీక్ష ఏర్పాటు చేసి అందరిని ఉత్తీర్ణత సాధించేలా చేశారు. కొందరు అక్షరాస్యుల నేర్చుకుని మరిచిపోయారు. ఇళ్ల వద్ద సాధన చేసుకోవాలనే అవగాహన కల్పించలేదు. స్థానిక ఉపాధ్యాయులు నిరక్షరాస్యులైన తల్లిదండ్రుల అక్షర ప్రగతి పై పిల్లలతో సమీక్షిఒచించాలి.

### వాలంటీర్లతో విజయవంతం చేసేందుకు కృషి : బీ.చలపతిరావు, యంఈవో, నేలకొండపల్లి.



ప్రతీ కేంద్రం కు వాలంటీర్ల ను ఏర్పాటు చేసి ఈ కార్యక్రమంను విజయవంతం చేసేలా చర్యలు తీసుకుంటున్నాం. జిల్లాలోనే మండలం ను ఆదర్శంగా చేయటానికి అందరి సహకారం తీసుకుంటున్నాం. కేంద్రాలకు పుస్తకాలు పంపిణీ పూర్తి చేశాం. అక్షరాస్యతను సాధించి తీరుతాం.

### గ్రామంలో నూరుశాతం సాధించేందుకు కృషి : మల్లెబోయిన పుష్ప, వాలంటీర్, బైరవునిపల్లి.



గ్రామంలో నిరక్షరాస్యులను గుర్తించి వారందరినీ అక్షరాస్యులుగా తీర్చిదిద్దటమే తమ కర్తవ్యం. అక్షర జ్ఞానం కల్పించే అవకాశం దక్కినందుకు చాలా సంతోషంగా ఉంది. ఇందుకు అవసరమైన సంఘాల సభ్యుల సహాకారం తీసుకుంటాం. కార్యక్రమం ను విజయవంతం చేసేందుకు కృషి చేస్తాం.

### ప్రభుత్వం లక్ష్యంలో తాము కూడ భాగస్వామ్యులవుతాం : అడపాల రామారావు, సామాజిక కార్యకర్త, నేలకొండపల్లి.



ప్రభుత్వం ప్రతీ ఒక్కరికి చదువు ఉండాలనే సంకల్పం చాలా మంచింది. నిరక్షరాస్యులను అక్షరాస్యులుగా తీర్చిదిద్దేందుకు తాము కూడ భాగస్వామ్యులు అవుతాం. తమ వంతుగా సహాయం చేయటానికి సిద్ధంగా ఉన్నాం. ప్రభుత్వం లక్ష్యం నెరవేర్చటం బాధ్యతగా తీసుకుంటాం.

## ముఖ్యమంత్రి సహాయ నిధి చెక్కుల పంపిణీ

**ప్రజాపక్షం/ రఘునాథపాలెం :** ముఖ్యమంత్రి సహాయ నిధి ద్వారా లబ్ధిదారులకు మంజూరైన చెక్కులను ఏఎంసి ఛైర్మన్ యరగర్ల హన్మంతరావు పంపిణీ చేశారు. మంత్రి తుమ్మల నాగేశ్వరరావు సిఫారసు మేరకు మండల పరిధిలోని చిమ్మపుడి గ్రామంలో ముఖ్యమంత్రి సహాయ నిధి ద్వారా లబ్ధిదారులకు మంజూరైన చెక్కులను శనివారం ఏఎంసి ఛైర్మన్ యరగర్ల హన్మంతరావు, కాంగ్రెస్ మండల కన్వీనర్ దీప్లానాయక్, ఆత్మ కమిటీ ఛైర్మన్ దిరిశాల చిన్న వెంకటేశ్వర్లు పంపిణీ చేశారు. ఈసందర్భంగా ఏఎంసి ఛైర్మన్ మాట్లాడుతూ అర్హులైన ప్రతి ఒక్కరికి ప్రభుత్వ పథకాల ద్వారా లబ్ది చేకూరుస్తున్నట్లు తెలిపారు. ఈ కార్యక్రమంలో గ్రామశాఖ అధ్యక్షులు జోనబోయిన పాపయ్య, కోటేరు నర్సిరెడ్డి, ఎర్రా కరుణాకర్‌రెడ్డి, గుండ్ల గోవర్ధన్, భద్రారెడ్డి, శశిధర్‌రెడ్డి, తూము సత్యనారాయణ, దొంతు వెంకన్న, షేక్ రహీం, యాదగిరి, నరేష్, పుల్లయ్య, సిపిఐ నాయకులు సత్యనారాయణ పాల్గొన్నారు.



## స్మార్ట్‌కిడ్జ్‌లో బతుకమ్మ వేడుకలు



**ప్రజాపక్షం/ ఖమ్మం అర్బన్ :** ఖమ్మం నగరంలోని స్మార్ట్‌కిడ్జ్ పాఠశాలలో బతుకమ్మ వేడుకలను ఘనంగా నిర్వహించారు. శనివారం పాఠశాలలో బతుకమ్మ వేడుకల సందర్భంగా చిన్నారులు తీరొక్క పూలతో బతుకమ్మలను పేర్చారు. బతుకమ్మలన్ని ఒకచోట చేర్చి ఆటపాటలతో బతుకమ్మ సంబురాలు నిర్వహించారు. ఈ సందర్భంగా పాఠశాల కరస్పాండెంట్ చింతనిప్పు కృష్ణచైతన్య మాట్లాడుతూ తెలంగాణ ప్రాంతంలో బతుకమ్మ పండుగకు ఎంతో విశిష్టత ఉందన్నారు. తెలంగాణ ఉద్యమంలోనూ బతుకమ్మ ఓ భాగమైందన్నారు. తొమ్మిది రోజుల పాటు ప్రకృతిలో లభించే వివిధ రకాల పూలతో బతుకమ్మలను పేర్చి పూలను పూజించే ప్రత్యేక పండుగ బతుకమ్మ పండుగ అన్నారు. మన సంస్కృతి, సాంప్రదాయాలను చిన్నతనం నుంచే అలవర్చుకునేలా తమ పాఠశాలలో ఇటువంటి కార్యక్రమాలను నిర్వహిస్తున్నట్లు తెలిపారు.ఈ కార్యక్రమంలో డైరెక్టర్ చింతనిప్పు సుకన్య, ప్రిన్సిపాల్, ఉపాధ్యాయులు, విద్యార్థులు తదితరులు పాల్గొన్నారు.

# నేటి నుంచి మావోయిస్టు పార్టీ స్థాపనా వారోత్సవాలు

- విజయవంతం చేయాలంటూ లేఖ విడుదల
- మావోయిస్టు పార్టీ వరుస లేఖలు, భిన్నాభిప్రాయాలు
- సంక్లిష్ట పరిస్థితుల్లో మావోయిస్టుల ఉనికి
- అప్రమత్తమైన పోలీస్ యంత్రాంగం



**ప్రజాపక్ష/భద్రాద్రి కొత్తగూడెం :** మావోయిస్టు పార్టీ స్థాపనా వారోత్సవాలకు సిద్ధమవుతోంది. ఇందులో భాగంగా ఇప్పటికే ఏజెన్సీలో వారోత్సవాలు విజయవంతాన్ని కోరుతూ పోస్టర్లు విడుదలయ్యాయి. దీంతో ఏజెన్సీ ప్రాంతంలో మరో సారి ఉత్కంఠ వాతావారణం నెలకొంది. సిపిఐ ఎంఎల్ పీపుల్స్ వార్, ఎంసిసి, సిపిఐ ఎంఎల్ నక్సల్బరీల విలీనంతో 2004 సెప్టెంబర్ 21న సిపిఐ మావోయిస్టు పార్టీ పురుడుపోసుకుంది. 2013 నాటికి దేశంలో 76 జిల్లాలు వామపక్షతీవ్ర ప్రభావానికి లోనయ్యాయి. మరో 106 జిల్లాలు సిద్ధాంతాలకు అండగా నిలుస్తున్నాయి. ఇదిలా ఉండగా 2020 లో మళ్లీ తెలంగాణలో పార్టీ కార్యకలాపాలు మరోసారి ఉపందుకున్నాయి. ఛత్తీస్‌గఢ్ రాష్ట్రంలో సమాంతర పాలన సాగించిన మావోయిస్టు పార్టీకి గత ఏడాది కాలంగా కోలుకోలేని దెబ్బ తగులుతోంది. కేంద్రంలోని బీజేపీ మావోయిస్టు తీవ్రవాదాన్ని 2026 మార్చి 31 నాటికి దేశంలో లేకుండా చేస్తామని బాహాటంగానే ప్రకటిస్తోంది. దీంతో ఈ ఏడాది మార్చి 21న మావోయిస్టు పార్టీ కేంద్ర కమిటీ కార్యదర్శి నంబాళ్ల కేశవరావు, అలియాస్ బసవరాజుతో సహా పలువురుని భద్రతా బలగాలు కాల్చి చంపాయి. గడిన ఏడాది కాలంగా మావోయిస్టు పార్టీకి చెందిన సుమారు 300 మంది కేంద్ర,రాష్ట్ర, జిల్లాల కమిటీలకు చెందిన వివిధ క్యాడర్ల సభ్యులు హతమయ్యారు. మావోయిస్టు పార్టీ స్థాపనలో గణపతి ప్రధాన కార్యదర్శిగా పనిచేశారు. వయోభారంతో ఆయన తప్పుకోవడంతో 2018లో నంబాళ్ల కేశవరావు, అలియాస్ బస్వరాజు బాధ్యతలు నిర్వర్తించారు. నంబాళ్ల ఈ ఏడాది జరిగిన ఎన్‌కౌంటర్‌లో మృతి చెందడంతో పార్టీ బాధ్యతలను దళిత సామాజిక వర్గానికి చెందిన తిప్పరి తిరుపతి అలియాస్ దేవ్‌జీకి అప్పగించారు.

### పోస్టర్ విడుదల...

ఏజెన్సీలో సిపిఐ మావోయిస్టు కేంద్రకమిటీ పేరిట పోస్టర్లు విడుదలయ్యాయి. ఈ నెల 21 నుండి 27 వరకు జరిగే స్థాపనా వారోత్సవాలను దేశ వ్యాప్తంగా జయప్రథం చేయాలని, విప్లవోధ్యమాన్ని కాపాడుకోవాలని, ఆపరేషన్ కగార్‌ను విఫలం చేద్దామని, వెనుకంజ స్థితిని అదిగమిద్దామని, సమర్థతను పెంచుకుని ముందుకు సాగుదామని ఆ పోస్టర్‌లో ఉంది.

### పలులేఖలు, భిన్న అభిప్రాయాలు...

మావోయిపార్టీ సంక్లిష్ట పరిస్థితుల్లో ఉన్న వేళ పార్టీ పేరిట పలు లేఖలు విడుదలవుతున్నాయి. గత మూడు రోజుల క్రితం మావోయిస్టు పార్టీ కేంద్ర అధికార ప్రతినిధి అభయ్ పేరిట లేఖతో పాటు ఆడియో వీడుదలయ్యాయి. వాటిలోని సారాంశం ప్రకారం ఆయుధాలు వదిలేస్తాం, పోరాటాన్ని తాత్కాలికంగా విరమిస్తాం, నేలరోజుల పాటు కాల్పుల విరమణను కేంద్రం ప్రకటించాలంటూ పేర్కొన్నారు. శాంతిచర్చలకు తాము అనుకూలమని పదేపదే చెబుతున్నప్పటికీ ఏకపక్ష కాల్పులకు పూనుకోవడం సరికాదని, ఇప్పటికైనా ఏర్పాటు చేసిన ప్రతినిధులతో చర్చలకు సిద్దమే అంటూ చెప్పుకొచ్చారు. ఇదిలా ఉండగా ఆ మరుసటి రోజే తెలంగాణ మావోయిస్టు పార్టీ రాష్ట్ర అధికార ప్రతినిధి జగన్ పేరిట మరో లేఖ విడుదలైంది. కేంద్రకమిటీ అధికార ప్రతినిధి సోనూ అలియాస్ అభయ్ పేరుతో విడుదల చేసిన సాయుధ పోరాట విరమణ ప్రకటన ఆయన వ్యక్తిగత అభిప్రాయమే గానీ పార్టీ నిర్ణయం కాదని స్పష్టంగా పేర్కొన్నారు. కాగా అభయ్ పేరిట వచ్చిన లేఖ, ఆడియో టేపులపై అనుమానాలు వ్యక్తం కావడంతో జగన్ లేఖ ద్వారా ఓ స్పష్టత వచ్చింది. మావోయిస్టు కేంద్ర,రాష్ట్ర పార్టీలు ఒకే విషయంపై రెండు అభిప్రాయాలు వ్యక్తం చేయడం వెనుక పలు చర్చలకు తావిస్తోంది.



### సంక్లిష్ట పరిస్థితుల్లో మావోయిస్టుల ఉనికి ...

మావోయిస్టు పార్టీ ఎన్నడూ లేని సంక్లిష్ట పరిస్థితులను ఎదుర్కొంటోంది. ఛత్తీస్‌గఢ్, మహారాష్ట్ర, ఒడిసా, ఆంధ్రప్రదేశ్, తెలంగాణ, మహారాష్ట్ర, ఝార్కాండ్ రాష్ట్రాలతో పాటు పలు మావోయిస్టు ప్రభావిత రాష్ట్రాలను కేంద్ర పారామిలటరీ బలగాలు జల్లెడ పడుతున్నాయి. ఈ క్రమంలో అడవులపై భద్రతా బలగాలు ఆదిపత్యాన్ని కొనసాగుస్తున్నాయి. ఇప్పటికే పెద్ద ఎత్తున మావోయిస్టులను ఎన్‌కౌంటర్ చేస్తూ పైచేయి సాధిస్తున్నాయి. ఈ క్రమంలో అగ్రనేతలు సైతం మృత్యువాత పడ్డారు. అడుగడుగునా బేస్‌క్యాంపులు ఏర్పాటు చేసి మావోయిస్టుల కదలికలను నియంత్రిస్తున్నారు. ఈ క్రమంలో శాంతి చర్చల మాట తెరపైకి వచ్చింది. చర్చలకు సిద్ధం అంటూ పలు లేఖలను సైతం మావోయిస్టు పార్టీ విడుదల చేసింది. అయినప్పటికీ అదేమీ పట్టించుకోని కేంద్ర పారామిలటరీ బలగాలు ముప్పేట దాడికి పూనుకుంటున్నాయి. మునుపెన్నడూ లేని నష్టం పార్టీకి వాటిల్లింది. ఇలాంటి సంక్లిష్ట పరిస్థితుల్లో మావోయిస్టు పార్టీ ఉనికి ప్రశ్నార్థంగా మారినట్లు విప్లవోధ్యమ విశ్లేషకులు భావిస్తున్నారు. ఇదిలా ఉండగా విప్లవోధ్యమాన్ని కాపుడుకుందాం, శక్తిని కూడగట్టుకుందా, ఆపరేషన్ కగార్‌ను ఓడిద్దాం, స్థాపవోత్సవాలను విజయవందం చేద్దాం అంటూ మావోయిస్టు కేంద్రకమిటీ పేరుతో పోస్టర్లు విడుదల కావడంతో చర్చ మరో కోణం వైపు దారితీస్తోంది.

### అప్రమత్తమైన బలగాలు...

మావోయిస్టు పార్టీ స్థాపన వారోత్సవాలకు సిద్ధమైన వేళ భద్రతా బలగాలు అప్రమత్తమయ్యాయి. మావోయిస్టు పార్టీ తిరోగమనంలో పడింది అని భావిస్తున్న వేళ ఆ పార్టీ కేంద్ర కమిటీ పేరిట విడుదలైన పోస్టర్ ఒకింత ఉలికి పాటుకు గురిచేసినట్లైయింది. దీంతో భద్రతా బలగాలు మరింత అప్రమత్తమయ్యాయి. ఎలాంటి చెదురుమదురు సంఘటనలో చోటు చేసుకోకుండా మావోయిస్టు ప్రభావిత అటవీ ప్రాంతాలు, గ్రామాలపై దృష్టి సారించాయి. జాతీయ రహదార్లను, రాష్ట్రాల సరిహద్దులను ఆదీనంలోనికి తీసుకున్నారు. వాహన తనిఖీలు చేపడుతూ అనుమానితులను ప్రశ్నిస్తున్నారు.

# సమస్యలు పరిష్కరించాలని సిపిఐ ఆందోళన

**సమస్యల పరిష్కరిస్తామని స్థానిక ఎమ్మెల్యే హామీ**



**ప్రజాపక్షం/సత్తుపల్లి:** మున్సిపాలిటీ పరిధిలోని ద్వారకాపురి కాలనీ సమస్యల వలయంగా ఉందని గత బిఆర్ఎస్ ప్రభుత్వం నిర్లక్ష్యంతో ఇక్కడ ప్రజలు ఇబ్బంది పడుతున్నారని, తక్షణమే ద్వారకాపురి కాలనీ సమస్యలు పరిష్కరించాలని కోరుతూ శనివారం సిపిఐ జిల్లా కార్యవర్గ సభ్యులు దండు అదినారాయణ ఆధ్వర్యంలో సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా దండు మాట్లాడుతూ కాలనీలో నెలకొన్న సమస్యలు పరిష్కరించాలని కోరుతూ గత వారం రోజులుగా తహశీల్దార్ కార్యాలయం, విద్యుత్ శాఖాధికారులకు, మున్సిపాలిటీ అదికారుల వద్ద ఆందోళన కార్యక్రమాలు నిర్వహంచామన్నారు. విషయం తెలుసుకున్న శాసన సభ్యురాలు డా.మట్టా రాగమయి దయానంద్ విజయకుమార్, రాష్ట్ర కాంగ్రెస్ నాయకులు డా.మట్టా దయానంద్ విజయ్ కుమార్ లు ద్వారకాపురి కాలనీ సమస్యలు యుద్ధ ప్రాతిపదికన పరిష్కరిస్తానని హామీ ఇచ్చారు. గత 15,20 సంవత్సరాలుగా ప్రభుత్వ భూమిలో ఇల్లు వేసు కొని నివాసం ఉంటున్న వారికి పట్టాలు లేవని, పట్టాలివ్వాలని ఇళ్ల స్థలాలు లేని పేదల అనేకమంది ఉన్నారని వారందరికీ ఇళ్ల స్థలాలు ఇవ్వాలని, 33 కెవి లైన్ ఇల్లు మీద నుంచి పోతుందని వాటిని తీసివేసి ప్రజలకు ఇబ్బంది లేకుండా చేయాలని సిపిఐ జిల్లా కార్యవర్గ సభ్యుల దండు ఆదినారాయణ విజ్ఞప్తి చేశారు. ఈ కార్యక్రమంలో కాంగ్రెస్ పార్టీ పట్టణ అధ్యక్షులు గాదె చెన్నకేశవరావు, కాంగ్రెస్ పార్టీ పట్టణ నాయకులు కమల్ పాషా, కాంగ్రెస్ పార్టీ సీనియర్ నాయకులు ఉడత నేని అప్పారావు, సిపిఐ సత్తుపల్లి పట్టణ సహాయ కార్యదర్శి పాలకుర్తి వీరయ్య, సత్తుపల్లి పట్టణ కమిటీ సభ్యులు, ద్వారకాపురి కాలనీ శాఖ కార్యదర్శి ఎర్రజల రాజశేఖర్, ఎండి గఫార్, ద్వారకాపురి కాలనీ అభివృద్ధి కమిటీ అధ్యక్షుడు మాతిపోగు సీమోను, మంద నాగరాజు, సూరయ్య, మాణిక్యం, తులసి, శ్రీదేవి, మహేష్, ఎస్కే ఖాశీం, రమణమ్మ, రాజు, వెంకటమ్మ, సుశీల, శ్రావణి, సీతమ్మ, సుబ్బలమ్మ, రాములమ్మ, దానియేలు రాజు తదితరులు పాల్గొన్నారు.

## ఘనంగా బతుకమ్మ సంబరాలు



**ప్రజాపక్షం/ఆళ్లపల్లి:** జిపిఎస్ మైలారం పాఠశాల నందు విద్యనభ్యపిస్తున్న బాలికలు రంగు రంగుల పూలతో బతుకమ్మను అలంకరించి నృత్యాలు చేశారు. అనంతరం పాఠశాల ప్రధానోపాధ్యాయులు జోగ రాంబాబు మాట్లాడుతూ తెలంగాణ ఆడబిడ్డల ఆత్మగౌవరం, మన సాంప్రదాయాల సాక్ష్యం అయిన బతుకమ్మ పండుగను ప్రతి సంవత్సరం ఘనంగా జరుకుంటామని, ఇది పూల పండగ మాత్రమే కాదని, సోదర భావం, ఐక్యత ఆడబిడ్డల ఆనందమని, ప్రకృతి పట్ల కృతజ్ఞతలు తెలియజేసే సాంస్కృతిక చిహ్నమని అన్నారు. పూలతో చేసిన బతుకమ్మలో ప్రకృతి సౌందర్యం దాడి ఉందని, ఆడపిల్లలు వలయంగా చేరి పాడే బతుకమ్మ పాటల్లో తెలంగాణ మట్టిలోనే మనసు ప్రతిబింబిస్తుందన్నారు. బతుకమ్మ బతుకమ్మ ఉయ్యాలో, తెలంగాణ ఆడబిడ్డల హృదయాలలో అని పాటలు పడారు. ఈకార్యక్రమంలో అనంతోగు పే సెంటర్ ప్రధానోపాధ్యాయులు చీమల భద్రమ్మ, కొమరం లాలయ్య, కృష్ణ, మోహన్ బాబు, లక్ష్మీనారాయణ, సాంబశివరావు, రాంబాబు, కుమార్ రాజా, కే రామయ్య, బి శ్రీను, చిన్న, రమేష్, అంగన్వాడీ టీచర్ బాయమ్మ, ఆయా జోగ సావిత్రి, తదితరులు పాల్గొన్నారు.

## పాఠశాలలో బతుకమ్మ సంబురాలు



**ప్రజాపక్షం/అన్నపురెడ్డిపల్లి:** మండల కేంద్రంలో ఉన్నటువంటి జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాల నందు తెలంగాణ ప్రభుత్వం ఎంతో ప్రతిష్టాత్మకంగా నిర్వహించనున్న దసరా పర్వదిన బతుకమ్మ సంబురాలు సందర్భంగా ప్రభుత్వ పాఠశాలలో తల్లిదండ్రులు ఆత్మీయ సమావేశం బతుకమ్మ సంబురాలను నిర్వహించే కార్యక్రమంలో భాగంగా పాఠశాల ప్రధానోపాధ్యాయులు ఏ వెంకటేశ్వరరావు ఆధ్వర్యంలో పాఠశాల విద్యార్థిని విద్యార్థులు తల్లిదండ్రుల సమావేశాన్ని ఏర్పాటు చేసి వివిధ ఆటలు సాంస్కృతిక కార్యక్రమాల్లో గెలుపొందిన విద్యార్థులకు బహుమతులను ప్రదానం చేశారు. అనంతరం పాఠశాల ఆవరణలో బతుకమ్మలను ఏర్పాటు చేయించి ఆటపాటలతో విద్యార్థులతో ఏర్పాటు చేయించి ఆటపాటలతో విద్యార్థులతో నృత్యాలను చేయించారు. ఈకార్యక్రమంలో ఉపాధ్యాయులు, ఉపాధ్యాయ సిబ్బంది, తల్లిదండ్రులు పాల్గొన్నారు.

## ఘనంగా బతుకమ్మ వేడుకలు



**ప్రజాపక్షం/అశ్వాపురం:** అశ్వాపురం మండలంలోని ఎమిలీ పబ్లిక్ స్కూల్ పాఠశాల యాజమాన్యం ఆధ్వర్యంలో ముందస్తు బతుకమ్మ వేడుకలను ఘనంగా నిర్వహించారు. ముందుగా ఎమిలీ పబ్లిక్ స్కూల్ కరస్పాండెంట్ ములకలపల్లి గోపీనాథ్ మాట్లాడుతూ బతుకమ్మ వేడుకలను పాఠశాలలో జరుపుకోవడం చాలా సంతోషకరమైన విషయమని, విద్యార్థులకు బతుకమ్మ పండుగ రాష్ట్ర పండుగని, తెలంగాణ రాష్ట్ర గొప్పతనం గురించి వివరించారు. ఈ కార్యక్రమంలోఉపాధ్యాయురాలు, విద్యార్థులు, విద్యార్థుల తల్లిదండ్రులు పాల్గొన్నారు.

## ఘనంగా బతుకమ్మ సంబురాలు



**ప్రజాపక్షం/బూర్గంపాడు:** స్థానిక సారపాక బ్రిలియంట్ విద్యాసంస్థల నందు ఉపాధ్యాయులు విద్యార్థులు సాంప్రదాయ దుస్తులను ధరించి పలు రకాల పూలతో బతుకమ్మలను చేసి జానపద పాటలు నృత్యాలతో తెలంగాణ సంస్కృతి ఉట్టిపడేలా అంగరంగ వైభవంగా బ్రిలియంట్ మేనేజ్మెంట్ ఆధ్వర్యంలో బతుకమ్మ వేడుకలను నిర్వహించారు. ఈ సందర్భంగా బ్రిలియంట్ విద్యాసంస్థల ఛైర్మన్ డాక్టర్ బిఎన్ఆర్ మాట్లాడుతూ తెలంగాణ సంసృతి సాంప్రదాయాలను ప్రతిబింబించే అత్యంత పెద్ద పండుగ బతుకమ్మ పండుగ అని, విద్యార్థులకు చదువుతో పాటు సంస్కృతి సంప్రదాయాలపై సమాజం పట్ల అవగాహన కల్పించాలనే ఉద్దేశంతోనే ఈ వేడుకలను నిర్వహించడం జరిగిందన్నారు. అనంతరం విద్యార్థులు ఉపాధ్యాయులు బతుకమ్మలను నిమజ్జనం చేశారు. ఈకార్యక్రమంలో ఉపాధ్యాయులు, విద్యార్థులు పాల్గొన్నారు.

## ఘనంగా బతుకమ్మ వేడుకలు



**ప్రజాపక్షం/బూర్గంపాడు:** మండల కేంద్రంలోని న్యూసెంచరీ హైస్కూల్ నందు శనివారం బతుకమ్మ వేడుకలను ఘనంగా నిర్వహించారు. విద్యార్థులకు దసరా సెలవుల నేపథ్యంలో ఒక రోజు ముందుగానే పాఠశాలలో విద్యార్థినీ, విద్యార్థులు ఉపాధ్యాయులు అందరూ బతుకమ్మ వేడుకలను ఘనంగా నిర్వహించారు. ఈసందర్భంగా న్యూసెంచరీ హైస్కూల్ కరస్పాండెంట్ ఆశిక్ లైక్ మాట్లాడుతూ దసరా పండుగ, బతుకమ్మ గొప్పతనం గురించి విద్యార్థులకు తెలిపారు.

# డ్వాక్రా మహిళలకు దసరా కానుక చీరలు సిద్ధం

**ప్రజాపక్షం/పెనుబల్లి:** మహిళా గ్రూపు సంఘాలకు తెలంగాణ ప్రభుత్వం ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి మహిళలకు దసరా కానుకలు సర్వం సిద్ధం చేశారు అధికారులు. గ్రూపు సంఘాల మహిళలకు 800 రూపాయలు విలువచేసే చీరలను మహిళలకు దసరా కానుకగా పంపిణీ చేస్తున్నారు. పెనుబల్లి మండలం లో మొత్తం 1260 డ్వాక్రా సంఘాల గ్రూపులు ఉన్నాయి. సుమారు 12,600 మంది పైగా మహిళలు, 40 మంది గ్రామ సమైక్యలు ఉన్నారు. వీరందరికీ మంత్రి రేవంత్ రెడ్డి ఆదేశాల మేరకు దసరా కానుకగా చీరలను పంపిణీ చేసేందుకు అధికారులు రంగం సిద్ధం చేశారు. ఇందులో ఒక్కొక్క మహిళలకు ఒక చీర నా.. రెండు చీరలు పంపిణీ చేస్తారా అన్న విషయం సోమవారం కలెక్టరేట్లో జరిగే సమావేశంలో నిర్ణయించబడుతుందని సమాచారం. గత బిఆర్ఎస్ ప్రభుత్వంలో బతుకమ్మ వేడుకలకు రేషన్ కార్డు ఉన్న ప్రతి ఒక్క మహిళకు చీరలను పంపిణీ చేశారు. నేటి రేవంత్ ప్రభుత్వంలో మహిళా సంఘాల గ్రూపులలో ఉన్న మహిళలకి నాణ్యమైన




చీరలు పంపిణీ చేస్తుండడం డ్వాక్రా సంఘాల మహిళలు హర్షం వ్యక్తం చేస్తున్నారు. తద్వారా మహిళా సంఘాల కొత్త గ్రూపులు ఏర్పాటు జరుగుతుందని మహిళా అభివృద్ధికి, మహిళా స్వయం ఉపాధికి దోహదపడుతుందని పలువురు అభిప్రాయం వ్యక్తం చేస్తున్నారు.

# త్రివేణి పాఠశాలలో బతుకమ్మ సంబురాలు

**ప్రజాపక్షం/ ఖమ్మం అర్బన్ :** ఖమ్మం నగరంలోని త్రివేణి పాఠశాలలో బతుకమ్మ సంబురాలను ఘనంగా నిర్వహించారు. శనివారం బతుకమ్మ సంబురాల్లో భాగంగా విద్యార్థులు వివిధ రకాల పూలతో బతుకమ్మలను తయారు చేసి ఆటపాటలతో సందడి చేశారు.ఈ సందర్భంగా పాఠశాల డైరెక్టర్ గొల్లపూడి వీరేంద్రచౌదరి మాట్లాడుతూ దుర్గా మాతకు ప్రతిరూపంగా పెద్దమ్మతల్లిగా భావించి తొమ్మిది రోజుల పాటు తెలంగాణ ప్రజలు బతుకమ్మ పండుగను నిర్వహిస్తారని తెలిపారు. పూలను పూజించే పండుగ బతుకమ్మ అన్నారు. బతుకమ్మ యొక్క ప్రాముఖ్యతను వివరించారు. ప్రిన్సిపాల్ రాజేంద్రప్రసాద్ మాట్లాడుతూ తొమ్మిది రోజుల పాటు నగరాలు, పల్లెలు అనే తేడా లేకుండా తెలంగాణ సంస్కృతిని ప్రతిభింభిస్తూ బతుకమ్మ పండుగను ఘనంగా జరుపుకుంటారన్నారు. సంస్కృతి, సాంప్రదాయాలను విద్యార్థులకు తెలిపేం



దుకే ఇటువంటి కార్యక్రమాలను నిర్వహిస్తున్నట్లు ఆయన తెలిపారు.ఈ కార్యక్రమంలో త్రివేణి కృష్ణవేణి విద్యా సంస్థల డైరెక్టర్ యార్లగడ్డ వెంకటేశ్వరరావు, సిఆర్వో మురళికృష్ణ, వైస్ ప్రిన్సిపాల్ స్వప్న, చార్లెస్, సందీప్, ఉపాధ్యాయులు, విద్యార్థులు తదితరులు పాల్గొన్నారు.

# జిల్లాలో విద్యుత్ కనెక్షన్ లేని ఇళ్లు లేకుండా చూడటమే లక్ష్యం



**ప్రజాపక్షం/నేలకొండపల్లి :** జిల్లాలో విద్యుత్ కనెక్షన్ లేని ఇళ్లు లేకుండా చేయటమే ప్రభుత్వ లక్ష్యమని విద్యుత్ శాఖ ఎస్.ఈ. ఇనుగుర్తి శ్రీనివాసచారీ పేర్కొన్నారు. మండలం లోని తిరుమలాపురం లో అంగన్వాడీ కేంద్రం కు జూగా పథకం కింద విద్యుత్ కనెక్షన్ ఏర్పాటు చేశారు. శనివారం ఆయన చేతుల మీదుగా ప్రారంభించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడారు. జిల్లాలో ఎస్సీ, ఎస్టీ లు విద్యుత్ కనెక్షన్ లేని వారికి ఈ పథకం వర్తిస్తుందని పేర్కొన్నారు. సర్వీస్ లేని

**జిల్లా విద్యుత్ శాఖ ఎస్ఈ శ్రీనివాసచారి**

వారి ని గుర్తించి అందించే విధంగా చర్యలు తీసుకుంటున్నట్లు తెలిపారు. విద్యుత్ లేని ఇళ్లు లేకుండా చేసి జిల్లా ను ఆదర్శంగా నిలిపేందుకు చర్యలు తీసుకుంటున్నట్లు తెలిపారు. జన జీవనం కు దూరంగా ఉన్న వారినిగుర్తించి వారికి విద్యుత్ సౌకర్యం కల్పించనున్నట్లు తెలిపారు. అవసరమైన చోట ప్రత్యేక ట్రాన్స్ ఫార్మర్ ను ఏర్పాటు చేసి విద్యుత్ కనెక్షన్ ను అందించనున్నట్లు తెలిపారు. ఇప్పటి వరకు జిల్లాలో 149 కనెక్షన్లు అవసరమని గుర్తించినట్లు తెలిపారు. ఖమ్మం డివిజన్లో 16, ఖమ్మం రూరల్ డివిజన్ లో 12, సత్తుపల్లి డివిజన్ లో 7 గ్రామాలను గుర్తించినట్లు తెలిపారు. సర్వీస్ లేని ప్రతీ ఒక్కరికి సర్వీస్ ను అందించే లక్ష్యంతో ముందుకు సాగుతున్నట్లు తెలిపారు. జిల్లాలో ఈ నెలాఖారు నాటికి పూర్తి చేయనున్నట్లు తెలిపారు. ఈ కార్యక్రమంలో విద్యుత్ శాఖడీఈఈ లు చింతమళ్ల నాగేశ్వరరావు, బద్రుపవార్, ఏడీ లు చక్రవర్తి, కోక్యానాయక్, ఏఈ.కె.రామారావు సిబ్బంది పాల్గొన్నారు.

# రూ.16 లక్షలతో మెగా బ్లాక్ ప్లాంటేషన్ ప్రారంభం

**ప్రజాపక్షం/నేలకొండపల్లి :** జాతీయ గ్రామీణ ఉపాధి హామీ పథకం ద్వారా ఏర్పాటు చేయనున్న మెగా బ్లాక్ ప్లాంటేషన్ ను శనివారం ఎంపీడీఓ యం.యర్రయ్య ప్రారంభించారు. మండలంలోని అప్పలనరసింహాపురం లో ప్రభుత్వం కు చెందిన 4 ఎకరాలను ప్లాంటేషన్ కు కేటాయించారు. ఈ మేరకు ఆ స్థలంలో 6 వేల మొక్కలను నాటే కార్యక్రమం ను ప్రారంభించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడారు...వన మహోత్సవంలో భాగంగా మొక్కలు నాటుతున్నట్లు తెలిపారు. వనాలను పెంచేందుకు ప్రభుత్వం ప్రత్యేక శ్రద్ధ తీసుకుంటున్నట్లు తెలిపారు. అందులో భాగం



గానే జాతీయ గ్రామీణ ఉపాధి హామీ పథకం ద్వారా రూ.16 లక్షలను మంజూరు చేసినట్లు తెలిపారు. నాటిన ప్రతీ మొక్క ను సంరక్షించాలని సూచించారు. ప్రభుత్వం లక్యం ను నెరవేర్చేందుకు ప్రతీ ఒక్కరూబాధ్యత గా తీసుకోవాలని సూచించారు. ఈ కార్యక్రమంలో తహాశీల్దార్ వి.వెంకటేశ్వర్లు, మండల పంచాయతీ అధికారి శివ, మార్కెట్ కమిటి మాజీ చైర్మన్ వెనికె జానకి రామయ్య, ఈజీఎస్ ఏపీవో ఆర్.సునీత, ఈసీ శేషగిరిరావు, పంచాయతీ కార్యదర్శి ఇబ్రిహం, టీ.ఏ. గోపి, క్షేత్ర సహాయకుడు పుల్లయ్య తదితరులు పాల్గొన్నారు.

# పాఠశాలల్లో ముందస్తు బతుకమ్మ వేడుకలు

**ప్రజాపక్షం/కల్లూరు:** కల్లూరు మండలం పరిధిలోని పలు ప్రభుత్వ, ప్రైవేటు పాఠశాలల్లో ముందస్తు బతుకమ్మ వేడుకలను ఘనంగా నిర్వహించారు. ఆవరణలలో అందమైన ముగ్గులు తో వాటిపైన పూలను పెట్టి ముందుగా గౌరీ పూజ నిర్వహించి, విద్యార్థిని విద్యార్థులు, ఉపాధ్యాయులు బతుకమ్మ ఆడారు. కల్లూరు లోని ప్రతిభ విజ్ఞాన్ బాలాజీ తెలంగాణ గ్రామర్ స్కూల్ లతోపాటు పలు ప్రైవేటు ప్రభుత్వ పాఠశాలల్లో ముందస్తుగా బతుకమ్మ పాటలతో వేడుకలను ఘనంగా నిర్వహించారు. ఈ కార్యక్రమంలో ప్రతిభ విద్యాసంస్థల డైరెక్టర్ లక్కినేని ప్రసాద్, కరస్పాండెంట్ రఘు, ప్రధానోపాధ్యాయులు మేకల శ్రీనివాస



రావు, ఉపాధ్యాయులు తోపాటు విజ్ఞాన్ పాఠశాలలో ఎస్కే స్త్రైల్, ఉపాధ్యాయులు, బాలాజీ స్కూల్లో బాలాజీ కార్యక్రమంలో పాల్గొన్నారు.

# సిపిఐ జాతీయ మహాసభలకు ఖమ్మం ప్రతినిధులు




**ప్రజాపక్షం/ ఖమ్మం :** పంజాబ్‌లోని మొహాలీలో జరుగుతున్న భారత కమ్యూనిస్టు పార్టీ 25వ మహాసభలకు ఖమ్మం జిల్లా ప్రతినిధి వర్గం శనివారం బయలుదేరి వెళ్లింది. సిపిఐ రాష్ట్ర కార్యదర్శి వర్గ సభ్యులు బాగం హేమంతరావు నేతృత్వంలో వీరంతా చండీఘర్ మహాసభలకు ప్రతినిధులుగా వెళ్లారు. సిపిఐ జిల్లా కార్యదర్శి దండి సురేష్, సిపిఐ రాష్ట్ర కంట్రోల్ కమిషన్ ఛైర్మన్ మహ్మద్ మౌలానా, జిల్లా సహాయ కార్యదర్శి జమ్ముల జితేందర్‌రెడ్డి, రాష్ట్ర సమితి సభ్యులు యర్రాబాబు, ఎస్కె జానిమియా, ఏపూరి లతాదేవి, కొండపర్తి గోవిందరావు ప్రతినిధి బృందంలో ఉన్నారు. ఐదు రోజుల పాటు జరిగే ఈ మహాసభల్లో వీరు పాల్గొననున్నారు.

# ప్రజా సంక్షేమమే భట్టివిక్రమార్క లక్ష్యం

**ప్రజాపక్షం/ మధిర :** ప్రజా సంక్షేమమే డిప్యూటీ సిఎం, స్థానిక శాసనసభ్యులు మల్లు భట్టివిక్రమార్క లక్ష్యమని పట్టణ కాంగ్రెస్ పార్టీ అధ్యక్షులు మిరియాల రమణగుప్తా అన్నారు. శనివారం 16వ డివిజన్‌లో మల్లు భట్టివిక్రమార్క చిత్రపటంతో ఉన్న గోడ గడియారాలను దుకాణదారులకు పంపిణీ చేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ డిప్యూటీ సిఎం మల్లు భట్టివిక్రమార్క మధిర నియోజకవర్గ అభివృద్ధికి కోట్ల రూపాయలు నిధులు మంజూరు చేయటం జరుగుతుందని, ప్రజలకు అవసరమయ్యే అభివృద్ధి కార్యక్రమాలను చేపట్టడం జరుగుతుందని తెలిపారు. అలాగే స్థానిక





సంస్థల ఎన్నికలు వస్తున్న నేపథ్యంలో అందరూ కలిసికట్టుగా పనిచేసి విజయం సాధించాలని పిలుపునిచ్చారు. ఈ కార్యక్రమంలో డివిజన్ అధ్యక్షులు మైలవరపు కోటేశ్వరరావు, దేవిశెట్టి రంగా, తూములూరు రాజా, సిద్దంశెటి సందీప్, గుజ్జు జ్యోతి, నేలపాటి వెంకట్ పాల్గొన్నారు.

# ఘనంగా దసరా సంబరాలు

**ప్రజాపక్షం/ మధిర :** మధిర పట్టణంలోని శ్రీనిధి కాన్సెప్ట్ స్కూల్ ప్రాంగణంలో బతుకమ్మ పండుగను శనివారం ఘనంగా నిర్వహించారు. విద్యార్థులు పెద్ద సంఖ్యలో బతుకమ్మలు తయారు చేసి వాటిని స్కూల్‌కు తీసుకువచ్చారు. అందరూ




కలిసి బతుకమ్మ చుట్టూ ఆడి సామూహికంగా పాటలు పాడారు. అనంతరం పూజా కార్యక్రమాలు భక్తిశ్రద్ధలతో నిర్వహించారు. కరస్పాండెంట్, సెక్రటరీ ప్రిన్సిపాల్ అంజన్‌బాబు మాట్లాడుతూ ఇలాంటి పండుగలు జరుపుకోవడం వల్ల మన సంస్కృతి, సంప్రదాయాలను పరిరక్షించడంలో భావితరాల వారికి ఉపయుక్తంగా ఉంటాయని అభిప్రాయపడ్డారు. ఈ కార్యక్రమంలో డైరెక్టర్ చందు, ఇన్‌చార్జి ప్రిన్సిపాల్ డి.శ్రీనివాసరావు, ఉపాధ్యాయులు, తల్లిదండ్రులు తదితరులు పాల్గొన్నారు.

# పెన్షన్లు పెంచాలని ఎమ్మార్పీఎస్ వినతి

**ప్రజాపక్షం/మధిర రూరల్ :** వికలాంగులకు, వితంతువులకు, వృద్ధులకు ఫెన్షన్లు పెంచుతామని కాంగ్రెస్ ప్రభుత్వం హామీ ఇచ్చిందని, ఆ హామీని అమలు చేసి వారికి న్యాయం చేయాలని ఎమ్మార్పీఎస్, విహెచ్‌పిఎస్ నాయకులు



డిమాండ్ చేశారు. శనివారం మధిర మండలం సిద్దినేనిగూడెం గ్రామంలో ఫెన్షన్లు పెంచాలని కోరుతూ గ్రామ కార్యదర్శికి వినతి పత్రాన్ని అందచేశారు. ఈ సందర్భంగా నాయకులు మాట్లాడుతూ తెలంగాణ రాష్ట్రంలో అధికారంలోకి వస్తే వికలాంగులకు , వితంతువులకు, వృద్ధులకు రూ.2000 నుండి రూ.4000, రూ.4000 నుండి రూ.6000 పెంచుతామని కాంగ్రెస్ పార్టీ హామీ ఇచ్చి రెండు సంవత్సరాలు గడుస్తున్నా ఇంతవరకు ఆ ఊసే లేదన్నారు. ఇప్పటికైనా ప్రభుత్వం ఫెన్షన్లు పెంచి వారిని ఆర్థికంగా ఆదుకోవాలని కోరారు. ఈ కార్యక్రమంలో ఎమ్మార్పీఎస్ నాయకులు రాయవరపు దేవదాస్‌మాది, ఎఎస్‌పి నాయకులు ఎస్‌కె.రంజాన్, వేల్పుల పవన్‌కళ్యాణ్, కుక్కల ఆదాము, కొండూరి నాగేశ్వరరావు, తదితరులు పాల్గొన్నారు.

# నేటి నుంచి పాఠశాలలకు దసరా సెలవులు

**ప్రజాపక్షం/కల్లూరు:** కల్లూరు మండల పరిధిలోని పలు ప్రభుత్వ, ప్రైవేటు పాఠశాలలకు ప్రభుత్వం ఈనెల 21 నుంచి అక్టోబర్ మూడో తేదీ వరకు దసరా సెలవులు కొనసాగుతాయని మండల విద్యాశాఖ అధికారి నివేదిత తెలిపారు. విద్యాసంస్థలు సెలవుల్లో తరగతుల నిర్వహించవద్దని నిబంధనలు ఉల్లంఘిస్తే కఠిన చర్యలు తప్పవని హెచ్చరించారు. జూనియర్ కళాశాలలకు ఈనెల 28 నుంచి వచ్చే నెల ఆరో తేదీ వరకు సెలవులు కొనసాగుతాయని కళాశాల ప్రిన్సిపల్ తెలిపారు.

# సిపిఐ జాతీయ మహాసభలకు తొమ్మిదిమంది ప్రతినిధులు



**- కేంద్ర పరిధిలోని జిల్లా సమస్యలను తీర్మానంగా ప్రవేశపెడతాం**
**- సిపిఐ జిల్లా కార్యదర్శి ఎస్‌కె సాబీర్ పాషా**

**ప్రజాపక్షం/భద్రాద్రి కొత్తగూడెం :** ఈనెల 21 నుండి ఐదు రోజుల పాటు పంజాబ్ రాష్ట్రంలోని ఛండీఘర్‌లో జరుగనున్న సిపిఐ జాతీయ మహాసభలకు జిల్లా నుండి తొమ్మిది మంది ప్రతినిధులకు అవకాశం దక్కింది. ఎంపికైన ప్రతినిధులు జిల్లా కార్యదర్శి ఎస్‌కె సాబీర్ పాషా, నాయకులు ముత్యాల విశ్వనాథం, కల్లూరి వెంకటేశ్వరరావు, నరాటి ప్రసాద్, నరాటి ప్రసాద్, సరెడ్డి పుల్లారెడ్డి, మున్నా లక్ష్మీ కుమారి, ఎస్‌డి సలీం, సలిగంటి శ్రీనివాస్, దేవరకొండ శంకర్‌లు శనివారం ఛండీఘర్ బయలు దేరారు. రాష్ట్ర పార్టీ కోటా నుండి కొత్తగూడెంకు చెందిన సిపిఐ రాష్ట్ర కార్యదర్శి, కొత్తగూడెం ఎంఎల్‌ఎ కూనంనేని సాంబశివరావు ప్రతినిధిగా పాల్గొననున్నారు. ఈ సందర్భంగా పాషా మాట్లాడుతూ రాష్ట్రంలోని కోల్‌బెల్ట్ ప్రాంతంలో ప్రతిపాదనలో ఉన్న నూతన బొగ్గు గనుల ప్రైవేటీ కరణకు వ్యతిరేకంగా, ఎన్‌ఆర్‌ఇజిఎస్, 1/70 చట్టం అమలు, కార్మిక చట్టాలు, ప్రభుత్వ రంగ సంస్థల ప్రైవేటీకరణకు వ్యతిరేకంగా, గ్రామీణ ప్రాంతాల్లో గిరిజన, గిరిజనేతర పేదల భూముల సమస్యలు, విమానాశ్రయం, జిల్లాలో కేంద్రీయ విద్యాలయాలు ఏర్పాటు వంటి వాటిపై జిల్లా తరుపున తీర్మాణం ప్రవేశపెట్టనున్నట్లు చెప్పారు.

# చదువుతో పాటు మార్షియల్‌ఆర్ట్స్‌పై దృష్టి పెట్టాలి

**- ఐటిడిఏ పిఓ రాహుల్**

**ప్రజాపక్షం/భద్రాచలం :** బాల బాలికలు చదువులతో పాటు మార్షియల్ ఆర్ట్స్ పై దృష్టి సారించాలని ఐటిడిఏ పిఓ బి రాహుల్ అన్నారు. శనివారం స్థానిక డిగ్రీ కాలేజీలో మహిళా సాదికారిత ఆధ్వర్యంలో నిర్వహించిన కార్యక్రమానికి ఆయన ముఖ్యాతిధిగా హాజరయ్యారు. ఈ సందర్భంగా పిఓలు ప్రిన్సిపల్ తో పాటు సిబ్బంది ఘన స్వాగతం పలికారు. ఈ సందర్భంగా పిఓ మాట్లాడుతూ బాలికలు ఆత్మరక్షణ కోసం మార్షయల్ ఆర్ట్స్ ఎంతగానో ఉపయోగపడతాయన్నారు. తీసుకున్న శిక్షణ వృధా కాకుండా మెళుకువలను సాధనం చేయాలన్నారు. విపత్కర పరిస్థితుల్లో మాత్రమే ఇలాంటి విద్యకు పనిచెప్పాలని సూచించారు. అనంతరం ప్రిన్సిపల్ జాన్ మిల్టన్ మాట్లాడుతూ బాలబాలికలు ఎంతో శ్రద్దతో శిక్షణ తీసుకున్నారని, మార్షయల్ ఆర్ట్స్ నేర్చుకుని భద్రతపై అవగాహన పెంచుకున్నారని చెప్పారు. అనంతరం ప్రశంసా పత్రాలు అందజేశారు. ఈ కార్యక్రమంలో ప్రోగ్రాం ఆఫీసర్ రఘు, వైస్ ప్రిన్సిపల్ హవేలా, అకడమిక్ కో ఆర్డినేటర్ హిమజ, మహిళా సిబ్బంది కపిల భారతి, సమీరా, శ్రీలత, పర్యవేక్షకురాలు, రేవతి, పూర్ణిమ, కల్పన, శరణ్య, పావని, భవాని తదితరులు పాల్గొన్నారు.

# పెన్షన్ పెంచాలని గ్రామ పంచాయతీ కార్యాలయాల ముట్టడి

**ప్రజాపక్షం/ఏన్కూరు :** పెన్షన్ దారులకు పెన్షన్లు పెంచాలని శనివారం స్థానిక గ్రామపంచాయతీని ముట్టడించారు.మందకృష్ణ మాదిగ ఆదేశాల మేరకు ఏన్కూర్ మండల వ్యాప్తంగా పలు గ్రామపంచాయతీలను ముట్టడించడం జరిగింది. ఈ సందర్భంగా ఎమ్మార్పీఎస్ మండల అధ్యక్షుడు యంగల నరేష్ మాట్లాడుతూ ఎన్నికల సమయంలో అధికారం కోసం రేవంత్ రెడ్డి ఇచ్చిన మాట నిలబెట్టుకోవాలని కోరారు. 55 లక్షల మంది చేయూత పింఛన్ దారుల ఓట్ల కోసం పింఛన్ పెంచుతామని మాట ఇచ్చి వారిఓట్లతో అధికారంలోకి వచ్చి 22 నెలలు గడుస్తున్న పింఛన్లు పెంచకుండా కాలయాపన చేస్తూ వృద్ధులకు, వితంతువులు, వికలాంగులను మోసం చేస్తున్నాడని ఆయన అన్నారు. ఇచ్చిన మాట నిలబెట్టుకోలేని సీఎం రాజీనామా చేయాలని పింఛన్ పెంచుకుంటే తగు మూల్యం చెల్లించుకోక తప్పదని పింఛన్ దారుల పింఛన్ పెంపు కోసం భవిష్యత్తులో మంద కృష్ణ మాదిగ సారధ్యంలో ప్రత్యక్ష ఉద్యమాలకు సిద్ధం అవుతామని అన్నారు. స్థానిక సంస్థల ఎన్నికల్లో తగిన బుద్ధి చెప్పి తీరుతామని ఆయన హెచ్చరించారు. ముట్టడి కార్యక్రమం అనంతరం పంచాయతీ కార్యాలయాల కార్యదర్శులకు వినతి పత్రం అందజేశారు. ఈ కార్యక్రమంలో జెరిపోతుల నరేష్ మాదిగ, బాగం బిక్షం మాదిగ, కోటయ్య, వీరభద్రం, బిక్షం, నరసింహారావు ముఖ్య నాయకులు పాల్గొన్నారు.



# విద్యార్థుల భవిష్యత్‌కు భరోసా కల్పిస్తున్న పిఎస్‌ఆర్ ట్రస్టు



**ప్రజాపక్షం/ తిరుమలాయపాలెం :** పాలేరు నియోజకవర్గంలో ప్రభుత్వ పాఠశాలల్లో చదువుతున్న విద్యార్థినీ, విద్యార్థులకు పిఎస్‌ఆర్ ట్రస్టు వారు భవితకు భరోసా కల్పిస్తున్నారు. ఇటీవల దూర ప్రాంతాల నుంచి వచ్చి ప్రభుత్వ పాఠశాలల్లో విద్యను అభ్యసిస్తున్న విద్యార్థినిలకు సైకిళ్లు పంపిణీ చేయగా ప్రైవేట్ పాఠశాలలు ధీటుగా వారికి ప్రభుత్వ పాఠశాలల్లో చదువుతున్న విద్యార్థులకు బూట్లు, సాక్సులు పంపిణీ చేశారు. మంత్రి పొంగులేటి శ్రీనివాస్‌రెడ్డి సూచనల మేరకు మండల పరిధిలోని పిండిప్రోలు ప్రాథమిక పాఠశాలలో విద్యార్థినీ, విద్యార్థులకు ఒకటి నుండి 5వ తరగతి విద్యార్థులకు పాలేరు నియోజకవర్గ ఆత్మ కమిటీ చైర్మన్ చావా శివరామకృష్ణ చేతుల మీదుగా పంపిణీ చేశారు. ఇంత మంచి కార్యక్రమాన్ని నిర్వహించిన మంత్రి పొంగులేటి శ్రీనివాస్‌రెడ్డికి ఉపాధ్యాయులతో పాటు విద్యార్థులు ఆయనకు ప్రత్యేక అభినందనలు తెలిపారు. ఈకార్యక్రమంలో మాజీ ఎంపిపి బోడ మంగీలాల్, మాజీ ఎంపిటిసి గుగ్గిళ్ల అంబేద్కర్, కో ఆప్షన్స్ షేక్.సైపుద్దీన్, యువజన కాంగ్రెస్ మండల అధ్యక్షులు దూదిమెట్ల వెంకట్ గ్రామ కాంగ్రెస్ నాయకులు చామకూరి శ్రీనివాస్‌రెడ్డి, దొడ్డ గురవయ్య, వెంకన్న, జాల కిరణ్, రషీద్, నజీర్, మహేష్, పాఠశాల సిబ్బంది తదితరులు పాల్గొన్నారు.

# యూరియా కోసం రైతుల తిప్పలు

**ప్రజాపక్షం/రఘునాథపాలెం :** యూరియా కోసం రైతుల తిప్పలు తప్పటం లేదు. గంటల కొద్ది క్యూలో నిలుచుని యూరియా బస్తాలను దక్కించుకోవాల్సిన పరిస్థితి ఏర్పడింది. మహిళలు కూడా క్యూలో యూరియా కోసం నిలబడుతున్నారు. శనివారం వి. వెంకటాయపాలెం సొసైటీ వద్ద యూరియా పంపిణీ చేయడంతో రైతులు భారీగా తరలి వచ్చారు. కూపన్లు అందించి 225 బస్తాలను పంపిణీ చేసినట్లు సొసైటీ సిఈవో తిరుపతిరావు తెలిపారు. రఘునాథపాలెం సిఐ ఉస్మాన్ షరీఫ్ సొసైటీ వద్ద బందోబస్తును పర్యవేక్షించారు.



# వైయస్సార్ నగర్‌ను సందర్శించిన విద్యుత్ శాఖ డైరెక్టర్

**ప్రజాపక్షం/మణుగూరుః** మణుగూరులోని విద్యుత్ సౌకర్యం లేని వైయస్సార్ నగర్ ను విద్యుత్ శాఖ డైరెక్టర్ ప్రాజెక్ట్స్/టిజిఎన్‌పిడిసిఎల్ వి.మోహన్ రావు శనివారం సందర్శించారు. అక్కడి ప్రజలతో మాట్లాడి సోలా ర్, విద్యుత్ పోల్స్ లైన్లు వేయుట కొరకు సాధ్యాసాధ్యాలను పరీక్షించి ప్రజలతో ముఖాముఖిగా మాట్లాడి వారి నుంచి సమస్యలను తెలుసుకున్నారు. కార్యక్రమంలో భద్రాచలం డి ఈ కే జీవన్ కుమార్, కన్స్ట్రక్షన్ డిఈ వెంకటేశ్వర్లు, కన్స్ట్రక్షన్ ఏడీఈ, మణుగూరు ఏడిఈ, మణుగూరు విద్యుత్ సిబ్బంది పాల్గొన్నారు.



# లయన్స్ క్లబ్‌లోకి కొత్త సభ్యులను ఆహ్వానించండి

**ప్రజాపక్షం/భద్రాచలం :** లయన్స్ క్లబ్‌లోనికి నూతన సభ్యులను ఆహ్వానించాలని క్లబ్ గవర్నర్ మదన్ మోహన్ రేపాల అన్నారు. స్థానిక హరిత హోటల్లో జరిగిన శనివారం నిర్వహించిన సమావేశంలో ఆయన మాట్లాడారు. క్లబ్ ద్వారా ప్రజలకు మరిన్ని సేవలు చేసేందుకు యువతను, మహిళలను సభ్యులుగా చేయాలన్నారు. విద్య,వైద్యం, పర్యావరణ పరిరక్షణతో పాటు పలు సేవా కార్యక్రమాలకు శ్రీకారం చుట్టాలన్నారు. అనంతరం రాబోయే కార్యక్రమాలపై ప్రణాళిక సిద్దం చేశారు. ఈ కార్యక్రమంలో క్లబ్ అధ్యక్షురాలు కమల రాజశేఖర్, కార్యదర్శి సిద్దారెడ్డి, కోశాధికారి రామారావు,యోగి సూర్యనారాయణ, కురిచేటి శ్రీనివాస్, తిప్పన సిద్దులు, సోమశేఖర్, దేశప్ప, సోమశేఖర్ తదితరులు పాల్గొన్నారు.



# ఎంబిబిఎస్ సీటు సాధించిన పేదింటి యువతి

## ఆర్థిక సహాయం కోసం విద్యార్థిని ఎదురుచూపు

**ప్రజాపక్షం/ఏన్కూరు :** ప్రభుత్వ పాఠశాలల్లో కష్టపడి చదివి ఎంబీబీఎస్ సీటు సాధించి కనీస ఫీజులు కూడా చెల్లించలేని దీనస్థితిలో ఉన్న నిరుపేద విద్యార్థిని దాతల సహాయం కోసం ఎదురుచూస్తుంది. మండల పరిధిలోని రేపల్లెవాడ గ్రామానికి చెందిన మేడి నాగేశ్వరి నీట్ ఎంట్రన్స్ లో అత్యంత ప్రతిభ కనబరిచి 93.86 పర్సంటేజ్ తో వరంగల్ కె ఎంసి మెడికల్ కాలేజీలో కన్వీనర్ కోటాలో సీటు సాధించింది. ఈ మేరకు ఈ నెల 23న అడ్మిషన్ పొందాల్సి ఉంది. చేతిలో చిల్లిగవ్వలేక దాతల కోసం ఎదురుచూస్తుంది. నాగేశ్వరి ఒకటో తరగతి నుండి 4వ తరగతి వరకు రేపల్లెవాడ యుపిఎస్ ప్రభుత్వ పాఠశాలలో, ఐదో తరగతి నుండి పదో తరగతి వరకు వైరా గురుకుల విద్యాలయంలో విద్యను అభ్యసించింది. నీట్ కోచింగ్ సి ఓ ఈ గౌలిదొడ్డిలో తీసుకొని తొలి ప్రయత్నంలోనే సీటు సాధించడం విశేషం. తండ్రి రాములు పారిశుద్ధ్య కార్మికుడిగా పనిచేస్తూ కుటుంబాన్ని భారంగా నెట్టుకొస్తున్నాడు. దాతలు ఎవరైనా ఉంటే 7036892313 ఈ సెల్ నెంబర్ ను సంప్రదించాలని విద్యార్థిని తల్లిదండ్రులు కోరుతున్నారు.



# బిఎల్‌వోల సమావేశం

**ప్రజాపక్షం/వైరాః** వైరా మున్సిపాల్ కార్యాలయం నందు శనివారం డివిలోపివో రాంబాబు, తహశీల్దార్ శ్రీనివాసరావు, మున్సిపాల్ కమీషనర్ గురులింగంతో కలిసి వైరా మండల పరిధిలోని గ్రామపంచాయతీలు, మున్సిపాలిటీ పరిధిలోని వార్డుల బిఎల్‌వోలతో సమీక్ష నిర్వహించారు. ఈ సందర్భంగా ఎన్నికల అధికారుల ఆదేశాల మేరకు అధికారులు అనుసరించాల్సిన విధివిధానాలను ఈ సమావేశంలో చర్చించారు. ప్రతి గ్రామపంచాయతీలో బూత్‌లెవెల్ సిబ్బందితో అధికారులు, మున్సిపాలిటీలో వార్డులు, అధికారులు, బిల్ కలెక్టర్‌లకు పలు సూచనలు చేశారు.



# నారాయణకు నివాళి

**ప్రజాపక్షం/ బోనకల్ :** మండలంలోని తూటికుంట్ల గ్రామానికి చెందిన రైతు నాయకులుఉ వేమూరి ప్రసాద్ తండ్రి వేమూరి నారాయణ శనివారం మృతి చెందారు. మృతదేహాన్ని టిపిసిసి మెంబర్ పైడిపల్లి కిషోర్‌కుమార్, కాంగ్రెస్ మండల అధ్యక్షులు గాలి దుర్గారావు, సిపిఐ మండల కార్యదర్శి యంగల ఆనందరావు, సిపిఎం మండల నాయకులు ఏడునూతల లక్ష్మ ణరావు, మాజి జెడ్పిటిసి మోదుగు సుధీర్‌బాబు తదితరులు సందర్శించి పూలమాలలు వేసి నివాళులర్పించారు. అనంతరం కుటుంబసభ్యులకు తమ ప్రగాఢ సానుభూతిని తెలిపారు.



# కాంగ్రెస్‌లో ఉంటేనే నిరుపేదలా..

-భట్టి పద్ధతి మార్చుకోకపోతే ఆందోళన తప్పదు
-సిపిఎం నేత పోతినేని
-బోనకల్‌లో సిపిఎం పాదయాత్ర





**ప్రజాపక్షం/ బోనకల్ :** కాంగ్రెస్‌లో ఉంటేనే నిరుపేదలా అర్హులను గుర్తించి సంక్షేమాన్ని అమలు చేయడంలో ఎందుకు వివక్ష ప్రదర్శిస్తున్నారని సిపిఎం రాష్ట్ర కార్యదర్శి వర్గ సభ్యులు పోతినేని సుదర్శన్‌రావు ప్రశ్నించారు. కాంగ్రెస్‌లో లేకపోతే ఇందిరమ్మ ఇండ్లు మంజూరు చేయమని బహిరంగంగా చెబుతున్నారని ఈ పద్ధతి మానుకోక పోతే భట్టి విక్రమార్క ఇంటిని ముట్టడిస్తామని ఆయన హెచ్చరించారు. ప్రజా సమస్యలను ముఖ్యమంగా గ్రామ పంచాయతీల్లో పేరుకుపోయిన దీర్ఘకాలిక సమ్యలను పరిష్కరించాలని డిమాండ్ చేస్తూ సిపిఎం మండల కమిటీ ఆధ్వర్యంలో శనివారం తుటికుంట్ల నుంచి బోనకల్ తహసీల్దార్ కార్యాలయం వరకు పాదయాత్ర నిర్వహించారు. పాదయాత్రను సిపిఎం సీనియర్ నాయకులు మాదినేని నారాయణ జెండా ఊపి ప్రారంభించారు. సిపిఎం నేత కిలారు తిరుపతయ్య స్మారక స్తూపం వద్ద సుదర్శన్ పూలమాల వేసి నివాళులర్పించగా సిపిఎం జెండాను జిల్లా కార్యదర్శి నున్నా నాగేశ్వరరావు ఆవిష్కరించారు. పాదయాత్ర తహసీల్దార్ కార్యాలయంకు చేరుకుని రెండు గంటల పాటు ధర్నా నిర్వహించారు. ధర్నాను ఉద్దేశించి సుదర్శన్‌రావు మాట్లాడుతూ గతంలో మధిర నుంచి ప్రాతినిథ్యం వహించిన బోడేపూడి వెంకటేశ్వరరావు ప్రజల కోసం పనిచేశారు తప్ప సిపిఎం కార్యకర్తల కోసం పనిచేయలేదని కానీ భట్టి విక్రమార్క కేవలం కాంగ్రెస్ పార్టీకి చెందిన వారికే సంక్షేమ పథకాలను అమలు చేస్తున్నారని ఆయన రాష్ట్రానికి ఉప ముఖ్యమంత్రో, కాంగ్రెస్‌కు ఉప ముఖ్యమంత్రో అర్థం కావడం లేదన్నారు. ప్రభుత్వమంటే ప్రజలందరికీ సంక్షేమ పథకాలు అందించాలే కానీ మా పార్టీకే ఇస్తామంటే ఎలా అని సుదర్శన్‌రావు ప్రశ్నించారు. సంక్షేమ పథకాలకు ఖర్చు చేస్తున్న సొమ్ము కాంగ్రెస్ ది కాదని ప్రజల సొమ్మేనన్న విషయాన్ని విక్రమార్క లేదా కాంగ్రెస్ నేతలు గుర్తిస్తే మంచిదన్నారు. గోవిందాపురంలో వికలాంగుడు కన్నెపోగు బాబుకు అన్ని అర్హతలు ఉన్న ఇందిరమ్మ ఇల్లు ఇవ్వకపోవడం భట్టి వివక్షతకు నిదర్శనమన్నారు. అనంతరం డిమాండ్స్‌తో కూడిన వినతి పత్రాన్ని తహసీల్దార్‌కు అందజేశారు.ఈ కార్యక్రమంలో సిపిఎం జిల్లా కార్యదర్శి నున్నా నాగేశ్వరరావు, జిల్లా నాయకులు పొన్నం వెంకటేశ్వరరావు, చింతలచెరువు కోటేశ్వరరావు, డివిజన్ కార్యదర్శి మడుపల్లి గోపాలరావు, నాయకులు నాగేశ్వరరావు, తుళ్లూరి రమేష్, కిలారు సురేష్, ఉమా, జొన్నలగడ్డ సునీత, నరేష్, నాగేశ్వరరావు, శ్రీనివాసరావు, వెంకటనారాయణ తదితరులు పాల్గొన్నారు.

# పేదలకు అంగన్‌వాడీలు ఓ వరం : ఎమ్మెల్యే రాగమయి





**ప్రజాపక్షం/సత్తుపల్లిః** పేదలకు అంగన్ వాడి అద్భుత వరమన్నారు సత్తుపల్లి శాసన సభ్యురాలు డా. మట్టా రాగమయి దయానంద్ విజయ్ కుమార్. శనివారం మండల పరిధిలోని కొత్తూరు గ్రామంలో గల రైతు వేదికలో పోషణ మాసం వేడుకలు ఘనంగా నిర్వహించారు. ఈ పోషణ మాసం వేడుకలకు సత్తుపల్లి శాసన సభ్యురాలు డా. మట్టా రాగమయి దయానంద్ విజయకుమార్ ముఖ్య అతిథిగా హాజరయ్యారు. ముందుగా ఎన్టీఆర్ కాలనీకి చెందిన అంగన్ వాడి టీచర్ అగర్తా మృతికి సంతాపంగా రెండు నిమిషాలు మౌనం పాటించారు. అనంతరం సిడిపిఓ మెహరున్నీసా బేగంతో కలిసి జ్యోతి ప్రజ్వలన చేసి కార్యక్రమాన్ని ప్రారంభించారు. గర్భిణీలకు సీమంతాలు నిర్వహించి బాలింతలు, చిన్నారులకు పౌష్టికాహారాన్ని అందజేశారు. కార్యక్రమం ముగింపులో తెలంగాణ సంస్కృతి సాంప్రదాయాలు ఉట్టిపడేలా తిరక్క పూలతో అలంకరించిన బతుకమ్మలతో ఆడి పాడారు. ఈ కార్యక్రమంలో మార్కెట్ కమిటీ చైర్మన్ దోమ ఆనందబాబు, కాంగ్రెస్ పార్టీ పట్టణ అధ్యక్షుడు గాదె చెన్నారావు, డిసిసిబి డైరెక్టర్ చల్లగుంట్ల కృష్ణయ్య, వెంకటరెడ్డి, రామ్మోహన్ రెడ్డి, మండల పరిషత్ అధికారి నాగేశ్వరరావు, సూపర్ వైజర్స్ గంగా జలం, సుజాత, వసంత రాణి, భవాని, మహాలక్ష్మి , రమాదేవి, రజని, కమల ఆఫీస్ స్టాఫ్ వెంకటేశ్వర్లు, ప్రసాద్, పోషణ అభియాన్ కోఆర్డినేటర్ ప్రసాద్, అంగన్వాడీ టీచర్స్ పాల్గొన్నారు.

# దసరా సెలవులతో విద్యార్థులకు పండగే పండుగ





**ప్రజాపక్షం/సత్తుపల్లిః** సత్తుపల్లి పట్టణం నిండా దసరా శోభ నిండింది. నవరాత్రి ఉత్సవాలు ముగిసి, విజయదశమి వేళ రానే వచ్చింది. ఈ పండుగ సందర్భంగా రాష్ట్ర ప్రభుత్వం విద్యార్థులకు దసరా సెలవులు ప్రకటించడంతో వారి ఆనందం ఆకాశాన్నంటింది. బస్ స్టాండ్‌లో కనిపించిన దృశ్యాలు పండుగ ఆనందాన్ని కళ్లముందుంచాయి.

### సెలవుల రాకతో చిన్నారుల కేరింతలు...

సాయంత్రం వేళ కావడంతో సత్తుపల్లి బస్ స్టాండ్ విద్యార్థులతో కిక్కిరిసి పోయింది. బరువైన బ్యాగులు, సూట్‌కేసులు మోస్తున్నా వారి ముఖాల్లో ఎలాంటి అలసట కనిపించలేదు. చిరునవ్వులు, ఉత్సాహభరితమైన మాటలతో ఆ ప్రాంగణం మొత్తం సందడిగా మారింది. పండగంటే అందరితో కలిసి ఉండటమే కదా. ఈ సెలవులతో ఊరికి వెళ్లి మా అమ్మమ్మ, తాతయ్యలను కలుస్తాం. పెద్దలతో కలిసి పండుగ జరుపుకుంటాం అంటూ ప్రభుత్వ పాఠశాలల విద్యార్థులు తమ సంతోషాన్ని పంచుకున్నారు. పండుగకు ముందు ఇంటికి బయలుదేరిన విద్యార్థుల ఉత్సాహం, ఊరిలో వేచి ఉన్న ఆత్మీయులను కలవాలన్న తపన ఆ దృశ్యాన్ని మరింత భావోద్వేగంగా మార్చింది. వారి కళ్లలో మెరిసిన కాంతి, మనసు నిండా ఉన్న ఆనందం పండుగ ప్రాధాన్యతను మరోసారి గుర్తు చేసింది. ప్రైవేటు పాఠశాలల విద్యార్థుల్లో ఆశలు అయితే, ఇదే సమయంలో కొన్ని ప్రైవేటు పాఠశాలల్లో పూర్తిస్థాయి సెలవులు ఇవ్వకపోవడంతో విద్యార్థులు కొంత నిరుత్సాహానికి లోనయ్యారు. అయినప్పటికీ, వారూ పండుగ ఆనందాన్ని కోల్పోకుండా, వీలైనన్ని రోజులు ఇంటికి వెళ్లి తమ కుటుంబ సభ్యులతో గడపడానికి ప్రయత్నిస్తున్నారు. వారిలోనూ పండుగ వేడుకలకు సంబంధించిన ఆశ, ఆనందం స్పష్టంగా కనిపించింది.ప్రస్తుతం సత్తుపల్లిలో ఒకవైపు బస్ స్టాండ్‌లోని ఆనందోత్సాహాలు, మరోవైపు పండుగ వేడుకలకు వెళ్లేందుకు సిద్ధమైన విద్యార్థుల సందడితో పండుగ వాతావరణం ముందే మొదలైనట్లుగా ఉంది. దసరా పండుగ కేవలం ఒక వేడుక కాదు, బంధాలను బలపరిచే ఒక గొప్ప అవకాశం అని ఈ దృశ్యాలు నిరూపిస్తున్నాయి.

# ఎస్‌బిఐటిలో ముగిసిన వర్క్‌షాప్



**ప్రజాపక్షం/ ఖమ్మం అర్బన్ :** ఎస్‌బిఐటి ఇంజనీరింగ్ కళాశాలలో ఐదురోజుల పాటు నిర్వహించిన పవర్ బిఐ వర్క్‌షాప్ శనివారం ముగిసింది. ఈ సందర్భంగా కళాశాల ఛైర్మన్ గుండాల కృష్ణ మాట్లాడుతూ కంప్యూటర్, అనుబంధ రంగాలు పూర్తిగా డేటా పైనే ఆధారపడి ఉన్నాయన్నారు. పారిశ్రామిక అనుభవం కలిగిన నిపుణులు సిహెచ్ కిరణ్‌కుమార్ పర్యవేక్షణలోఐదు రోజుల పాటు నిర్వహించిన పవర్ బిఐ వర్క్‌షాప్ తమ కళాశాల విద్యార్థులు నైపుణ్యాలు పెంచుకోవడానికి ఎంతో ఉపయోగపడిందన్నారు. కళాశాల సెక్రటరీ అండ్ కరస్పాండెంట్ డా॥ జి. ధాత్రి మాట్లాడుతూ ద్వితీయ, తృతీయ సంవత్సరం సిఎస్ఈ డేటా సైన్స్ విద్యార్థులకు శిక్షణా కార్యక్రమాన్ని నిర్వహించినట్లు తెలిపారు. ఈశిక్షణలో భాగంగా విద్యార్థులకు డేటా క్లినింగ్, ఈటిఎల్, రిపోర్ట్ జనరేషన్ వంటి అంశాలపై అవగాహన కల్పించామన్నారు. మైక్రో సాఫ్ట్ సంస్థ సాఫ్ట్‌వేర్ అయిన పవర్ బిఐ నైపుణ్యం ద్వారా డేటా ఎనలిస్ట్, డేటా సైంటిస్ట్, డేటా ఇంజనీర్ వంటి వివిధ హోదాల్లో ఉద్యోగాలు పొందవచ్చునన్నారు. ప్రిన్సిపాల్ రాజ్‌కుమార్ మాట్లాడుతూ గత 15 ఏళ్లుగా పవర్ బిఐ మొదటి స్థానంలో నిలిపి తన ప్రాముఖ్యతను చాటుకుందన్నారు. కంప్యూటర్, ఇంటర్ నెట్ వినియోగం పెరిగే కొద్ది డేటా పెరుగుతుందన్నారు. రానున్న రోజుల్లో డేటా సైన్స్ విద్యార్థులకు ఉద్యోగ అవకాశాలు ఎక్కువగా ఉంటాయన్నారు. అనంతరం ట్రైనర్ సిహెచ్ కిరణ్ కుమార్‌ను అభినందించి సన్మానించారు. ఈ కార్యక్రమంలో అకాడమిక్ డైరెక్టర్లు గుండాల ప్రవీణ్ కుమార్, గంధం శ్రీనివాసరావు, ఎవివి శివప్రసాద్, జె. రవీంద్రబాబు, టిపివో సవిత, కో ఆర్డినేటర్ ప్రభాకర్ పాల్గొన్నారు.

# పోలీసుల పర్యవేక్షణలో యూరియా పంపిణీ



**ప్రజాపక్షం/ బోనకల్ :** ప్రభుత్వం నుంచి సరైన సమయంలో యూరియా అందకపోవడంతో తీవ్ర కొరత ఏర్పడింది. దీంతో రైతులు యూరియా కోసం ఎదురుచూడాల్సిన పరిస్థితి ఏర్పడింది. శనివారం ఖమ్మం జిల్లా బోనకల్ మండలం రావినూతల సహకార సంఘానికి 323 బస్తాల యూరియా మాత్రమే సరఫరా అయింది. విషయం తెలుసుకున్న రావినూతల, ఆళ్లపాడు గ్రామాలకు చెందిన 400మంది రైతులు యూరియా కోసం సహకార సంఘం వద్దకు చేరుకున్నారు. తమ పేర్లు ముందు అంటే తమ పేర్లు ముందు అతి తోపులాట జరిగింది. దీంతో పరిస్థితి ఉద్రిక్తంగా మారింది. రైతులకు యూరియా పంపిణీకి పోలీసులు రంగ ప్రవేశం చేశారు. స్థానిక ఎస్సై పొదిలి వెంకన్న, మండల వ్యవసాయాధికారి పి.వినయ్‌కుమార్ తమ సిబ్బందితో అక్కడికి చేరుకుని రైతులకు నచ్చచెప్పారు.

### సాగుభూమి ఆధారంగా యూరియా పంపిణీ చేయాలి...

యూరియా పంపిణీ ఆధార్‌కార్డుల ఆధారంగా కాకుండా సాగు చేసిన భూమి విస్తీర్ణం ఆధారంగా పంపిణీ చేయాలని రైతులు డిమాండ్ చేశారు. ఒకే కుటుంబంలో ఐదు ఆధార్ కార్డులు ఉంటే ఒక్కొక్కరికి రెండు బస్తాలు ఇస్తే మిగిలిన రైతులు యూరియా దొరకదని ఆందోళన వ్యక్తం చేశారు. రైతులకు సరిపడా యూరియాను వెంటనే సరఫరా చేయాలని ప్రభుత్వాన్ని వేడుకున్నారు. అధికారులు యూరియా స్టాక్‌కు సరిపడా కూపన్లు జారీ పంపిణీ చేశారు. మళ్లీ యూరియా ఎప్పుడు వస్తుందో తెలియదని, పంటలకు ఇబ్బందులు ఏర్పడుతాయని రైతులు ఆవేదన వ్యక్తం చేశారు.

# మున్సిపాలిటీ వర్కర్స్ యూనియన్ ఎన్నిక




**ప్రజాపక్షం/కల్లూరుః** జిల్లా మున్సిపాలిటీ వర్కర్స్ యూనియన్ ఏఐటీయూసీ ఉపాధ్యక్షులుగా ఊడల కృష్ణ కార్యదర్శిగా వజీర్‌మియాలు ఎన్నికయ్యారు. శనివారం ఖమ్మంలో తెలంగాణ రాష్ట్ర మున్సిపల్ స్టాఫ్ అండ్ ఔట్సోర్సింగ్ వర్కర్స్ యూనియన్ ఏఐటీయూసీ అనుబంధం జిల్లా సభలు ఖమ్మంలో అంబేద్కర్ భవన్లో జరిగాయి. ఈ మహాసభలో వారిని ఎంపిక చేశారు. జిల్లా కార్యవర్గ సభ్యులుగా చింతపల్లి, శ్రీను, కౌన్సిల్ సభ్యులుగా యశోద, అంజలి, సీతమ్మలు ఎన్నికయ్యారు .ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ జిల్లాలోని మున్సిపాలిటీ కార్మికుల సమస్యల పరిష్కారం కోసం కృషి చేస్తామని తెలిపారు. నూతన ఎన్నికైన వారికి జిల్లా ఉపాధ్యక్షులు వేము రాంబాబు, మండల సిపిఐ కార్యదర్శి దామాల దయాకర్ రావు, మండల పరిధిలోని ఏఐటీయూసీ అనుబంధ ప్రజా సంఘాలు ధన్యవాదాలు తెలిపారు.

# మృతుల కుటుంబాలకు ఆర్థికసాయం



**ప్రజాపక్షం/ఏన్కూరు :** మండల పరిధిలోని తిమ్మరావుపేట గ్రామంలో ఇటీవల అనారోగ్యంతో మృతి చెందిన కుటుంబాలకు తెలంగాణ రాష్ట్ర వైద్య ఆరోగ్య రవాణా శాఖ అధికారి బొర్ర తిరుపతయ్య శనివారం ఆర్థిక సహాయాన్ని అందజేశారు. గ్రామంలో ఇటీవల మరణించిన చల్ల భద్రాద్రి , తమ్మిశెట్టి రోహిత్ , ఇసనపల్లి కృష్ణ కుటుంబాలకు దశదిన కర్మలకు ఒక్కో కుటుంబానికి 5000 రూపాయల చొప్పున ముగ్గురి కుటుంబ సభ్యులకు 15 వేల రూపాయలు సహాయంగా గ్రామానికి చెందిన పెద్దలు తెప్పల సత్యం, మేడం వెంకటేశ్వర్లు ద్వారా కుటుంబ సభ్యులకు అందజేశారు. ఈ సందర్భంగా మృతుల కుటుంబ సభ్యులు బొర్ర తిరుపతయ్యకు కృతజ్ఞతలు తెలిపారు. ఈ కార్యక్రమంలో గ్రామస్తులు ఏర్పుల సామేలు, చల్లా కోటేశ్వరరావు తదితరులు పాల్గొన్నారు.